నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
ఆదివారం | ఫిబ్రవరి 23, 2025 | www.navatelangana.com

24న సీఎం రేవంత్‌రెడ్డి రాక



నవతెలంగాణ-కంఠేశ్వర్

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 24న నిజామాబాద్‌కు రానున్నరని బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా నరేందర్ రెడ్డిని గెలిపించాలని నిర్వహించే సభకు సీఎం రేవంత్ రెడ్డి హాజరుకానున్నారని తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని భూమారెడ్డి ఫంక్షన్ హాల్ లో జరిగే సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి నరేంధర్ రెడ్డి విద్యారంగం, ఉపాధ్యాయులపై, నిరుద్యోగులపై పూర్తి అవగాహన కలిగిన వ్యక్తి అన్నారు. ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతు.. బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి తనకు టికెట్ కోసం రూ.30 కోట్లు ఇచ్చానని చేసిన వ్యాఖ్యలపై కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, నుడా చైర్మెన్ కేశవేణు, మార్కెట్ కమిటీ చైర్మెన్ ముప్పా గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

24 తేదీనాటి ప్రజావాణి రద్దు



నవతెలంగాణ-కామారెడ్డి

ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి 24వ తేదీ నాటి(సోమవారం) కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శాసన మండల ఎన్నికల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు. ప్రజల విజ్ఞాపనలు తీసుకోవడానికి కలెక్టరేట్ లోని రూం నెంబర్ 25 లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల సమస్యల దరఖాస్తులు హెల్ప్ డెస్క్ లో అందజేయవచ్చని తెలిపారు.

ఎవరైతే మాకేంటి.. తగ్గేదేలే



వాగు నుంచి జేసీబీతో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు

బట్టాపూర్ వాగు నుంచి జోరుగా ఇసుక రవాణా

- నిబంధనలకు విరుద్ధంగా జేసీబీలతో ఇసుక తవ్వకాలు
- 34 వే బిల్లులతో 250 నుంచి 300 ట్రాక్టర్ల తరలింపు
- ఒక జేసీబీ, ఆరు ట్రాక్టర్‌లు పట్టుకున్న పోలీసులు
- రాజకీయ నాయకుల అండదండలతో కొనసాగిస్తున్న వైనం

నవతెలంగాణ-నిజామాబాద్

'రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదువా' అన్నట్టు ఇసుకాసురులు తలుచుకుంటే వారి వ్యాపారం మూడు జేసీబీలు ఆరు ట్రాక్టర్‌లు అన్న చందంగా సాఫీగా సాగుతోంది. అటు రాజకీయ నాయకులు, ఇటు అధికారుల అండదండలు పుష్కలంగా ఉండటంతో ఇసుక తరలింపులో తగ్గేదెలే అంటు సవాల్ విసురుతున్నారు. కొన్ని వే బిల్లులు తీసుకుంటూ ఇష్టానుసారంగా ఇసుకను ట్రాక్టర్‌లతో యథేచ్ఛగా తరలిస్తున్నారు. దీనికి తోడు సందేట్లో సడేమియా లాగా.. వీడీసీలు సైతం ఎంటరై.. ట్రాక్టర్‌కు కొంత చొప్పున డబ్బులు వసూలు చేస్తున్నాయి. దీంతో సామాన్య ప్రజానీకానికి చౌకగా లభించాల్సిన ఇసుక ధర అమాంతంగా పెరిగిపోతోంది. ఉన్నతాధికారు లు స్పందించి చర్యలు తీసుకుంటేనే ఈ ఆగడాలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంది. నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల మండలం బట్టా పూర్ పెద్దవాగు నుంచి జోరుగా కొనసా గుతున్న ఇసుక అక్రమ రవాణాపై నవతెలంగాణ ప్రత్యేక కథనం.

ఇందిరమ్మ ఇండ్ల కోసం, పేద మధ్య తరగతి ప్రజలు ఇండ్లు నిర్మించుకోవడానికి తక్కువ ధరకే ఇసుక లభ్యం కావాలని ప్రభుత్వం ఆలోచించి అవకాశం ఉన్న చోట ఇసుకను తరలించుకునేందుకు అనుమతులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో జిల్లా కలెక్టర్ బట్టాపూర్ వాగులోని ఇసుకకు అనుమతులను జారీ చేశారు. రూ. 6 వేలకు దొరికే ట్రాక్టర్ ఇసుక ఇక రూ.3000 కే దొరుకుతుందన సామాన్య జనం సంబుర పడ్డారు. కానీ వారి ఆశలను అడియాసలు చేస్తూ ఇసుక మాఫియా ఎంటరైంది. దీనికి తోడు గ్రామ కమిటీ సైతం గ్రామాభి వృద్ధికి డబ్బులు కేటాయించా లంటూ ట్రాక్టర్‌కో రేటును డిసైడ్ చేసింది.

బట్టా పూర్ వాగులోని ఇసుక తవ్వకాల కోసం బట్టాపూర్ గ్రామ కమిటీకి ట్రాక్టర్‌తో ఇసుకను తరలిస్తే ఒక్క ట్రాక్టర్‌కు 50 వేల రూపాయలు, ట్రిప్పునకు 500 గ్రామకమిటీకి మొత్తం 17 లక్షలు చెల్లించాలని ఒప్పదం కుదిరి నట్టు సమాచారం. ఇసుక తరలించ దానికి ఎమ్మార్వో కార్యాలయం వారు ఒక రోజులో 34 వే బిల్లులు ఇవ్వగా.. ఇసుకాసురులు మాత్రం ఎవరైతే మాకేంటి.. మమ్మల్ని ఆపేది ఎవరంటూ రెవిన్యూ, పోలీస్ వారికి సవాల్ చేస్తూ.. వారి కండ్లు కప్పి వే బిల్లులకు విరుద్ధంగా 250 నుండి 300 ట్రాక్టర్ల వరకు అక్రమంగా ఇసుక తరలించినట్లు సమాచారం.



ఇదిలా ఉంటే అధికారులే ముందుగా తనిఖీలకు వస్తున్నట్లు సదరు ఇసుక వ్యాపారులకు సమాచారం ఇవ్వడం, ట్రాక్టర్ డ్రైవర్లు అక్కడి నుండి వారి ట్రాక్టర్లు తీసుకుని పారిపోయి, అధికారులు ఆ ప్రాంతం నుండి వెళ్ళగానే మళ్ళీ వచ్చి యధావిధిగా వారి దందాను కొనసాగించడం పరిపాటి గా మారింది. మనుషుల చేత మాత్రమే ఇసుకను తీయాలని నిబంధన ఉండగా.. అక్రమా ర్యులు దానికి విరుద్ధంగా జేసీబీలతో ఇసుకను తోడుతూ తరలిస్తున్నారు.

కాగా నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని శు క్రవారం తహసీల్దార్‌కు సమాచారం అందగా.. పాయింట్ వద్దకు ఎమ్మార్వో వెళ్ళి చూడగా ఇచ్చిన పాయింట్ కంటే చాలా దూరంలో ఇసుకను లోడ్ చేస్తున్నారని, వే బిల్లులు సక్రమంగా లేవని ఒక నాలుగు ట్రాక్టర్లను, జేసీబీని పట్టుకొన్నారు. నాయకుల ఒత్తిడి మేరకో ఏమో గాని వారు అక్కడి నుండి పారిపోయారని, ట్రాక్టర్ తాళాలు తెచ్చామని ఎమ్మార్వో సమాధానం ఇవ్వడం కొసమెరుపు. మళ్ళీ ఒక గంట ఆగిన తర్వాత అక్రమార్కులు రెవిన్యూ అధికారులు అక్కడినుండి వెళ్ళగానే ఇసుక తవ్వకాలు యధావిధిగా రాత్రి వరకు కొనసాగించినట్టు సమాచారం.

పట్టుకుంటున్నా.. విడిపించుకుంటూ..

బట్టాపూర్ వాగు నుండి కమ్మర్ పల్లి వెళ్ళిన ఇసుక ట్రాక్టర్ లను అక్కడి అధికారులు పట్టుకోని నిలిపివేయగా అధికార పార్టీ నేతల ఫోన్ లతో పట్టుకున్న ట్రాక్టర్లను విడిచిపెట్టినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ముందు గ్రామకమిటీకి చెల్లించిన డబ్బుల విషయం అటుంచితే, బట్టాపూర్ వాగులో నుండి ఇసుకతో బయటకు వెళ్తున్న ఒక్కోట్రాక్టర్‌కు అదనంగా 200 రూపాయలు డబ్బులు వసూలు చేస్తున్నారని, వసూలు చేసిన డబ్బులు అధికారుల మామూళ్ళ కోసమేనని ప్రజలు చెవులు కోరుక్కుంటున్నారు. అయితే శుక్రవారం జరిగిన మెగా ఇసుక జాతర పెద్దఎత్తున ప్రచారం కావడంతో మైనింగ్ శాఖ ఏడీ.. శనివారం బట్టాపూర్ వాగులోకి వచ్చి విచారణ చేపట్టినట్లు తెలిసింది. అనంతరం వాగులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీస్ లు పట్టుకుని స్టేషన్ వద్దకు తెచ్చినట్లు సమాచారం.

ఇసుక అక్రమ రవాణా చేస్తే ఉక్కుపాదం మోపుతాం అని స్వయానా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పినా ఇసుక అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులే నేరుగా స్పందించి చర్యలు చేపడితే ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడే అవకాశం ఉందని, దీంతో తమకు చౌకగా ఇసుక లభిస్తదని సామాన్య ప్రజానీకం కోరుకుంటున్నారు. అయితే శనివారం సాయంత్రం సమయంలో ఒక జేసీబీని, ఆరు ట్రాక్టర్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

సోషలిస్టు వ్యవస్థనే ప్రత్యామ్నాయం

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్



మాట్లాడుతున్న చంద్రశేఖర్

నవతెలంగాణ-కామారెడ్డి

పెట్టుబడుదారి వ్యవస్థకు సోషలిజమే ప్రత్యాన్మాయమని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కందురి చంద్రశేఖర్ అన్నారు. 176 ఏళ్ల క్రితం వెలువడిన కమ్యూనిస్టు ప్రణాళిక నేటికీ అనుసరణీయమని అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో రెడ్‌బుక్ డే ను శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు కార్యకర్తలు పార్టీ రాజకీయ ముసాయిదాను సామూహిక పఠనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్టుబడిదారీ వ్యవస్థలో ఆర్థిక అసమానతలు సహజంగానే పెరుగుతున్నాయని పేర్కొన్నారు. 2008 లో అమెరికాలో వచ్చిన ఆర్థిక సంక్షోభం ప్రస్తుత ప్రపంచ సంక్షోభంగా మారిందని వివరించారు. నిరుద్యోగం పేదరికం పెరిగిందని, మరోపక్క కొంతమంది కార్పోరేట్ శక్తులు పెట్టుబడిదారుల దగ్గర సంపద పోగుపడుతోందన్నారు. మనదేశంలో నేటికీ 85 కోట్ల మంది తెల్ల రేషన్ కార్డుల మీద ఆధారపడి జీవనం కొనసాగిస్తు న్నారని మరోపక్క ప్రపంచ కుబేరుల్లో అదాని, అంబానీ లాంటి వారు చేరుతు న్నారని వివరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలు దీనికి కారణమని స్పష్టం చేశారు. సోషలిజం మాత్రమే ఆర్థిక అంతరాలు లేని సమాజాన్ని సృష్టిస్తుందని కమ్యూనిస్టు ప్రణాళిక పేర్కొందని ఇది అందరికీ ఆచరణీయమని పేర్కొన్నారు. సోషలిజం సాధించ డం కోసం కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకట్ గౌడ్, మోతి రామ్ నాయక్, కొత్త నర్సింలు ముధం అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు సేవించిన చిన్నారులు

నవతెలంగాణ-రామారెడ్డి

ఆరవ, 2వ తరగతి చదువుతున్న ఇద్దరు చిన్నారులు.. పురుగుల మందు సేవించి అపస్మారక స్థితికి వెళ్లిన ఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రెడ్డి పేట స్కూల్ తండా కు చెందిన ఇద్దరు అక్కాచెల్లెళ్లు స్థానిక పాఠశాలలో 6వ తరగతి, 2వ తరగతి చదువుతున్నారు. పాఠశాల నుండి వచ్చి క్రిమిసంహారకమందు సేవించి ఇంటి ముందు వాంతులు చేసుకోవడంతో స్థానికులు గమనించి తల్లిదండ్రులకు సమాచారం అందించగా చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడినుండి మెరుగైన చికిత్స నిమిత్తం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటకు తరలించారు. కూల్ డ్రింక్ అనుకొని పురుగుల మందు సేవించి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసింది

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

నవతెలంగాణ-బోధన్

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన ఏడాదికే రాష్ట్రాన్ని కోట్ల రూపాయల అప్పులు చేసిందని ఎన్నికలలో ఇచ్చిన 6 గ్యారంటీల హామీలను నెరవేర్చలేదని కేంద్రమంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని రమాకాంత్ ఫంక్షన్ హాల్ లో ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఓటర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని 500 మండలాలలో మూడు ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్నాయని అందులో బిజెపి ఆధ్వర్యంలో పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్నాయని అన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలు నెరవేర్చలేనందున కాంగ్రెస్ ప్రభుత్వం టీచర్ ఎమ్మెల్సీలో పాల్గొనడం లేదని, బీఆర్ఎస్ పార్టీ పట్టభద్రులకు, నిరుద్యోగులకు, ఉద్యోగులకు ఆనాడు మోసం చేసినందున ఈ ఎన్నికలలో అభ్యర్థులను ఎంపిక చేయలేదని విమర్శించారు. 2014లో కేసీఆర్ సీఎం అయినప్పుడు ఎమ్మెల్సీలకు కనీస ప్రాధాన్యత లేకుండా పోయిందని ప్రస్తుతం శాసనమండలిలో ఉపాధ్యాయుల సమస్యలపై గొంతెత్తడానికి ఎమ్మెల్సీలకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. అందరి సంక్షేమాన్ని కోరేది బిజెపి పార్టీ అని కావున ఈ ఎన్నికలలో పట్టభద్రుల అభ్యర్థిగా అంజిరెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కొమురయ్యకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో పాలన వదిలి రాహుల్ గాంధీ పిలుపు కోసం ప్రతిసారి ఢిల్లీకి వెళ్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, పసుపు బోర్డు జాతీయ చైర్మెన్ పల్లె గంగారెడ్డి ,జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్ర రెడ్డి, రాష్ట్ర నాయకులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, మోహన్ రెడ్డి, రంగారావు, నరసింహారెడ్డి,సుధాకర్ చారి తదితరులు పాల్గొన్నారు.

26 నుండి 28 వరకు నిజామాబాద్ మార్కెట్ గంజ్‌కు సెలవు

నవతెలంగాణ-ముప్కాల్

మహా శివరాత్రి పర్వదినాన్ని పునస్కరించుకొని లేబర్ హాలిడే కారణంగా ఈ నెల 26 నుండి 28 వరకు మూడు రోజుల పాటు నిజామాబాద్ శ్రద్ధానంద్ గంజ్ మార్కెట్ యార్డుకు సెలవు ఉంటుందని మండల ఉద్యానవన శాఖ అధికారి వినాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 01, 02 శనివారం, ఆదివారం కావడంతో గంజ్ తెరిచి ఉన్నప్పటికి, పసుపునకు సంబంధించిన లావాదేవీలు ఉండవని పేర్కొన్నారు. తిరిగి మార్చి 03న గంజ్ ప్రారంభం అవుతుందని తెలిపారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

రంజాన్ పండుగకు ఏర్పాట్లు పూర్తిచేయాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్
- శాంతిభద్రతల పర్యవేక్షణకు ప్రత్యేక యంత్రాంగం : ఎస్పీ సింధుశర్మ

నవతెలంగాణ-కామారెడ్డి

రంజాన్ ఉపవాస దీక్షల నేపథ్యంలో ప్రభుత్వ పరంగా చేపట్టే సౌకర్యాలను ముందస్తు ఏర్పాట్లతో సమన్వయంతో చేపట్టా లని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శనివారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరం లో ఎస్పీతో కలిసి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ.. రంజాన్ మాసం ఉపవాస దీక్షలు మార్చి 2 నుంచి ప్రారంభం సందర్భంగా తాగునీరు, శానిటేషన్, నిరంతర విద్యుత్ సరఫరా, వీధి లైట్లు, తదితర ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని, తాగునీటి సమస్య తలెత్తకుండా నీటిని సరఫరా చేయాలని మిషన్ భగీరథ, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బోర్లు, పైప్‌లైన్ మరమ్మతులు ఉంటే ముందస్తుగా చేపట్టాలని తెలిపారు. ప్రతి సంవత్సరం చేసే విధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. నమాజ్ సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని విద్యుత్ శాఖ ఎస్ఈకి సూచించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

ఎస్పీ సింధు శర్మ మాట్లాడుతూ.. జిల్లాలోని మసీదుల వద్ద శాంతి భద్రతలను పోలీసు యంత్రాంగం పర్యవేక్షిస్తుంద న్నారు. పండుగ నేపథ్యంలో పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉంటుందని తెలిపారు. సుహృత్ భావంతో పండుగను నిర్వహించుకోవాలని పేర్కొన్నారు. మత పెద్దలు మాట్లాడుతూ.. తెల్లవారు జామున ప్రార్థన సమయానికి ముందే నీటి సరఫరా చేయాలని కోరారు. మసీదుల వద్ద షేడ్ నెట్‌లను, వీడిలైట్‌లను ఏర్పాటుచేయాలని తెలిపారు. పండుగ సామానులు కొనుగోలుకు రాత్రి వేళల్లో దుకాణాలు ఉండే విధంగా చూడాలని పేర్కొన్నారు. సమావేశంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, అదనపు ఎస్పి చైతన్యరెడ్డి, అదనపు కలెక్టర్లు వి.విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓ ప్రభాకర్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి దేవేందర్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కుంభమేళ నుంచి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో 12 మందికి గాయాలు

- డీసీఎంను తప్పించబోయి అదుపు తప్పి బోల్తాపడ్డ తూఫాన్ వాహనం
- క్షతగాత్రులు యాదాద్రి జిల్లావాసులు

నవతెలంగాణ-మెండోరా

కుంభమేళ కు వెళ్లి తిరిగి వస్తుండగా తూఫాన్ వాహనం అదుపు తప్పి బోల్తా పడి 12 మందికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన ఈ ఘటన మెండోర మండలం బుస్సాపూర్ గ్రామ శివారులో శుక్రవారం రాత్రి చోటుచేసు కుంది. 12 మంది ఒకే గ్రామానికి చెందినవారు కావడం గమనార్హం. స్థానిక ఎస్ఐ వివరాల ప్రకారం యాదాద్రి జిల్లా కు చెందిన చాడ గ్రామానికి చెందిన 12 మంది ఈ నెల 17వ తేదీన కుంభమేళ కు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళుతున్న క్రమంలో భక్తులు ప్రయాణిస్తున్న తూఫాన్ వాహనం.. ఓ డిసియం వాహనాన్ని తప్పించబోవడంతో అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. కొందరికి కాళ్ళు చేతులకు గాయాలు కాగా మరి కొందరికి తల, నడుము , చాతి భాగాలలో దెబ్బలు తగులగా అంబులెన్స్ సహాయంతో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.





అదుపు తప్పి చెట్టును ఢీకొని బోల్తా పడ్డ తుఫాన్ వాహనం

క్షతగాత్రులలో డ్రైవర్ మళ్ల.బాలయ్యతో పాటు మరో 11 మంది సలేంద్ర.మల్లేష్ , సలేంద్ర.గట్టయ్య , ముస్కు పెంట రెడ్డి, మల్లమధు, గుర్రాల.మచ్చగిరి, సుబ్బయ్య, మల్ల అయిలయ్య, జక్కా.జనార్ధన్ రెడ్డి, దొంతి.యెల్లేష్ , ఇస్తారి, కూరెళ్ల.మురళి గౌడ్ లు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణ తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం పసుపునకు బోనస్ ప్రకటించాలి

- బోర్డుకు కేంద్రం చట్టబద్ధత కల్పించాలి
- మార్కెట్ యార్డును సందర్శించిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత
- బకనచర్ల ప్రాజెక్టుపై కేంద్రానికి లేఖ రాసి కోర్టులో కేసు వేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్



మార్కెట్‌యార్డులో పసుపును పరిశీలిస్తున్న కవిత

నవతెలంగాణ-కంఠేశ్వర్

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టు పసుపు బోర్డుకు మద్దతు ధర ప్రకటించాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం పసుపు బోర్డుకుచట్టబద్ధత కల్పించాలని అన్నారు. పసుపు ధర కల్పించకపోతే రైతులతో కలిసి నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్‌ను దిగ్బంధిస్తాం అని అన్నారు. శనివారం నిజామాబాద్ మార్కెట్ యార్డులో పసుపు విక్రయాలు పరిశీలించారు. అక్కడ పసుపు రైతులతో మాట్లాడి వారి కష్టాలు, సమస్యలు, మార్కెట్ లో ఉన్న ధరల వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేరుకే గెజిట్ జారీ చేసి కేంద్ర ప్రభుత్వం పసుపు బోర్డు ఏర్పాటు చేసిందని, కానీ చట్టబద్ధత కల్పించలేదని ఎండగట్టారు. దాంతో పసుపు ధరలు పడిపోయే పరిస్థితి ఏర్పడిందని, బోర్డుకు చట్టబద్ధత ఉంటే బయటి దేశాల నుంచి వచ్చే నాసిరకం పసుపు దిగుమతులు తగ్గుతాయని, దాని వల్ల స్థానికంగా పసుపునకు మంచి రేటు వస్తుందని వివరించారు. వ్యాపారులు రైతులను మోసం చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్రపోతుందని ధ్వజమెత్తారు. మార్చి 1లోపు బోనస్ ప్రకటించకపోతే జిల్లా కలెక్టరేట్ ను దిగ్బంధిస్తామని హెచ్చరించారు.

వివరాలు మెయిన్‌లో..

18 సెల్‌ఫోన్‌లు రికవరీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని ఒకటవ పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న 18 సెల్ ఫోన్లను రికవరీ చేసినట్లు నిజామాబాద్ ఒకటవ పోలీస్స్టేషన్ ఎస్‌హెచ్ఓ రఘుపతి శనివారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. నిజామాబాదు ఒకటవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న (18) మొబైల్ ఫోన్లు సి ఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి వాటి యజమానులకు 1 టౌన్ పోలీస్ స్టేషన్ యందు అప్పగించినట్లు ఎస్ హెచ్ ఓ తెలిపారు.



సెల్‌ఫోన్‌లు అందజేస్తున్న ఎస్‌హెచ్‌వో

నవతెలంగాణ 2
నిజామాబాద్
ఆదివారం | ఫిబ్రవరి 23, 2025 | www.navatelangana.com

విజయ్ హైస్కూల్లో ట్విన్స్ డే సంబరాలు



నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని మామిడిపల్లి విజయ్ హైస్కూల్లో కవల పిల్లల దినోత్సవాన్ని పరస్కరించుకుని శనివారం కవలలుగా విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆటపాటలతో సందడి చేశారు. కవలలు కె. అనుజ్, కె.తనుజ్ (1వ తరగతి), యం. నిషికంత, యం. ఒమజా (2వ తరగతి), పి. విష్ణు, పి. వైష్ణవి (4వ తరగతి), యం. శ్రీచరణ్, యం. శ్రీహిత (9వ తరగతి) పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ టి. కవితాదివాకర్, ప్రధానోపాధ్యాయురాలు జీ. రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్తేర్ రాణి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

సీఎంను కలిసిన జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు



నవతెలంగాణ-మోపాల్

మాజీ ఎంపీపీ, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు యాదగిరి, బోధన్ ఎమ్మెల్యే మాజీ మంత్రి పి సుదర్శన్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని, రానున్న స్థానిక సంస్థలు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించేలా జిల్లా నాయకులందరూ కలిసికట్టుగా పనిచేయాలని ముఖ్యమంత్రి తెలిపారని వివరించారు. కార్యక్రమంలో నిజామాబాద్ డీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలి

- విద్యార్థులకు సూచించిన విద్యాశాఖ ప్రాంతీయ సంచాలకులు

నవతెలంగాణ-బాల్కొండ/మెండోర

పదవ తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలకు ఎలాంటి ఒత్తిడి చెందకుండా, ఉపాధ్యాయుల మార్గదర్శకాన్ని అనుసరించి, ధైర్యంగా పరీక్షలను ఎలా ఎదుర్కోవాలో విద్యార్థులకు విద్యాశాఖ వరంగల్ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు(ఆర్‌జేడీ) సత్యనారాయణ రెడ్డి సూచించారు. టీ శాట్ ద్వారా మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా టీశాట్ ఛానల్ ద్వారా విద్యాశాఖ సెక్రటరీ యోగితా రానా విద్యార్థులకు ప్రత్యేక సందేశం ఇచ్చారు. అనంతరం మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఆర్‌జేడీ మాట్లాడుతూ పదవ తరగతి సిలబస్ పూర్తయినందున ఇకపై సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆర్‌జేడీ సత్యనారాయణ రెడ్డి ఆకాంక్షించారు. ప్రిపరేటరీ పరీక్షలలో ఎలాంటి మానసిక ఒత్తిడికి గురికాకుండా ధైర్యంగా, ఆనందంగా రాయాలని కోరారు. సెక్రటరీ సూచనలను ప్రతి ఒక్క విద్యార్థి పాటించాలని, ఇది వారిని విజయపథంలో నడిపిస్తుందని పేర్కొన్నారు. క్రమ శిక్షణతో చదివి లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు ఎం ప్రశాంత్ కుమార్ , ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



బాల్కొండ: విద్యార్థులకు టీశాట్ ఛానల్ ద్వారా మాట్లాడుతున్న విద్యాశాఖ సెక్రెటరీ యోగితా రానా



మెండోరలో...

మెండోర : పదవ తరగతి టీశాట్ ద్వారా పదవ తరగతి పరీక్షల సంసిద్ధత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీ సాట్ ద్వార విద్యార్థులు వీక్షించుటకు అన్ని ఏర్పాట్లు చేసామని , అలాగే మండలం లోని అన్ని ఉన్నత పాఠశాలల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా టీశాట్ ఛానల్ ద్వారా విద్యాశాఖ సెక్రటరీ యోగితారాణా విద్యార్థులకు ప్రత్యేక సందేశం ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో మండల విద్యాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ.. వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. విషయ నిపుణులు ఆయా విషయాల్లో సబ్జెక్టుల్లో మార్కులు ఎలా సాధించాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. పది సిలబస్ పూర్తయినందున ఇకపై సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ప్రిపరేటరీ పరీక్షల్లో ఎలాంటి మానసిక ఒత్తిడికి గురికాకుండా ధైర్యంగా, ఆనందంగా రాయాలని కోరారు. సెక్రటరీ సూచనలను ప్రతి ఒక్క విద్యార్థి పాటించాలని , ఇది వారిని విజయపథంలో నడిపిస్తుందని పేర్కొన్నారు. క్రమ శిక్షణతో చదివి లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, సంబంధిత సబ్జెక్ట్ ఉపాధ్యాయులు , విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

24న పట్టభద్రుల సమావేశాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-బాల్కొండ

మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 24న నిజామాబాద్ భూమారెడ్డి ఫంక్షన్ హాల్‌లో జరిగే పట్టభద్రుల సమావేశంలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల కేంద్రంలో సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యే ఈ సమావేశంలో పట్టభద్రులు అధిక మొత్తంలో పాల్గొని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తౌట్ అరవింద్, వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇమ్రాన్ ఖాన్, పార్టీ నాయకులు సయ్యద్ రియాజ్, ప్రవీణ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఆరోగ్య విద్య అధికారి వెంకటేశ్వర్లు, ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ విశాల్ అన్నారు. నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన సదస్సు కార్యక్రమం శనివారం ప్రగతి నగర్ లోని ప్రధానమంత్రి కౌశల్ కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలు వాటి బారిన పడకుండా తమని తాము కాపాడుకోవాల్సిన పద్ధతులు, ఇదివరకే మాదకద్రవ్యాలకు బానిసలుగా మారిన వారిని కాపాడేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి జిల్లా ఆరోగ్య విద్య అధికారి వెంకటేశ్వర్లు, ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ విశాల్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ముగింపు సందర్భంగా జిల్లా యువజన అధికారిని శైలి బెల్లాల్ మాట్లాడుతూ.. మన అలవాట్లను మనం నియంత్రించుకోవాలని అన్నారు. విద్య, క్రీడల విషయంలో ఎక్కువగా శ్రద్ధ చూపాలని యువతకు సూచించారు. మాదకద్రవ్యాల గురించి వాటి దుష్పరిణామాల గురించి పాటల రూపంలో కళాజాత బృందం అలరించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సుధాకర్, నెహ్రూ యువ కేంద్ర సిబ్బంది, కౌశల్ విద్యా కేంద్ర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు

- సీపీఐ



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పట్టబద్దుల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఉంటుందని సీపీఐ నాయకులు అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ-సిపిఐ కార్యాలయంలో శనివారం ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం కొనసాగుతున్న పట్టబద్దుల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వి.నరేందర్ రెడ్డికి సిపిఐ మద్దతు తెలుపుతున్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజాపాలన ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధికి మరింత ప్రోత్సహించే విధంగా పట్టబద్దుల చేయూత అవసరమని అన్నారు ఈనెల 27న జరిగే పట్టబద్దుల ఎన్నికల్లో కాంగ్రెస్, సిపిఐ బలపరిచిన వి.నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పార్టీ, ప్రజాసంఘాల శ్రేణులతో పాటు జిల్లాలోని పట్టభద్రులను కోరారు ఈ ప్రెస్ మీట్‌లో సిపిఐ నగర కార్యదర్శి వై.ఓమయ్య, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రఘురాం, నాయక్, సిపిఐ జిల్లా నాయకులు పి. నర్సింగరావు పాల్గొన్నారు.

నిరుద్యోగులను, ఉపాధ్యాయులను మోసంచేసి

ఏ మొహం పెట్టుకుని ఓట్లు అడగడానికి వస్తున్నారు..

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను, ఉపాధ్యాయులను మోసం చేసి ఏ మొఖం పెట్టుకొని ఓట్లు అడగటానికి వస్తున్నారో సమాధానం చెప్పాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు. ఉమ్మడి నిజామాబాదు, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మిర్చీకాంపౌండ్ లోని అర్బన్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేట్, టీచర్ ఓటర్ల సమావేశానికి ముఖ్యఅతిథులుగా కేంద్ర మంత్రివర్యులు, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు గంగపురం కిషన్ రెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ, అసెంబ్లీ సభ పక్ష నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు నెరవేర్చిన తరువాతే ఓట్లు అడగాలని అన్నారు. గ్యారంటీలు, డిక్లరేషన్లు, హామీల పేరుతో తెలంగాణ సమాజాన్ని మోసం చేసి ఊసరవెల్లిలా రంగులు మారుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి గ్రాడ్యుయేటర్లు బుద్ధి చెప్పడం ఖాయం అన్నారు. డిగ్రీ పూర్తి చేసిన యువత ఆలోచన చేసి ప్రశ్నించే గొంతుకలైన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డిని, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఉమ్మడి గురుకుల ప్రవేశపరీక్ష 5వ తరగతి నుండి 9 వ తరగతి వరకు తెలంగాణ ప్రభుత్వం ఆదివారం నిర్వహిస్తున్నట్లు డిచ్‌పల్లి మండలం లోని ధర్మారం బి గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ మాధవిలత శనివారం ఒక ప్రకటన లో తెలిపారు. ఈ పరీక్ష రాయడానికి సిద్ధంగా ఉన్న విద్యార్థులు పరీక్ష కేంద్రానికి ఉదయం 9 గంటల కు రావాలని తెలిపారు. పరీక్షలకు వచ్చే వారు తమ వెంట హాల్ టికెట్, పరీక్ష ప్యాడ్, బ్లూ లేదా బ్లాక్ పెన్నులు తీసుకొని రావాలని సూచించారు. హాల్ టికెట్లలో ఏమైనా తప్పిదాలు ఉన్నట్లతే విద్యార్థులు చదువుతున్న పాఠశాల నుండి బోన ఫైడ్ సర్టిఫికెట్ లేదా ఆధార్ కార్డులను తీసుకొని వచ్చి ఇన్విజిలేటర్లకు చూపించాలని ప్రిన్సిపాల్ కోరారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల

విద్యారంగ వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలు

- ఏఐపిఎస్యు జాతీయ కార్యదర్శి షఫీవుల్లా
- ప్రారంభమైన ఏఐపిఎస్యు తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం (ఏఐపిఎస్యు) రాష్ట్ర మహాసభలు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్లో ప్రారంభమయ్యాయి ఈ సందర్భంగా ఆలిండియా కార్యదర్శి షఫీ ఉల్లా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యను కాషాయకరణ చేసేందుకే నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొస్తుందని అన్నారు ప్రభుత్వ విద్యా రంగం బలోపేతం అవ్వాలంటే ప్రభుత్వం విద్యారంగానికి కేటాయించాల్సిన బడ్జెట్ పెంచాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా విద్యార్థులకు సరైన సమయంలో స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థుల డ్రాప్ అవుట్ పెరుగుతున్నాయని అన్నారు. ఈ మహాసభలలో గత కార్యక్రమాలను సమీక్షించుకొని భవిష్యత్తు కార్యక్రమాలను రూపొందించుకోవడం జరుగుతుందని తెలిపారు. శాస్త్రీయ విద్య విధానాన్ని అభివృద్ధి చేసేందుకు విద్యార్థి సంఘం నిరంతరం పోరాటం చేస్తుందని అన్నారు. బిజెపి ప్రభుత్వం తన సిద్ధాంతాన్ని బలవంతంగా రుద్దుతుందని, స్వయం ప్రతిపత్తి కలిగిన విద్యా కేంద్రాల్లో కేంద్ర ప్రభుత్వం ఈ విధంగా తన అధిపత్యం చలాయించడం ఆపాలని అన్నారు. విశ్వవిద్యాలయాలకు బడ్జెట్ కేటాయింపుల్లో కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాలని తెలిపారు. ప్రజావ్యతిరేక విధానాలు విద్యార్థి వ్యతిరేక విధానాలపై ప్రధానంగా చర్చ జరుగుతుందని అన్నారు.

కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బోడ అనిల్, మన్నె కుమార్, ఆర్ఎస్పి పార్టీ రాష్ట్ర నాయకులు యార్లగడ్డ సాయిబాబా, శివాజీ, ప్రభాకర్, మహిళా రాష్ట్ర కన్వీనర్ విజయలక్ష్మి, ఏఐపిఎస్యు రాష్ట్ర నాయకులు సాయి కుమార్, గోపాల్ సింగ్, రాజు, ఆనంద్, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరించిన నాయకులు

విద్యార్థుల ఆత్మహత్యకు కారణమవుతున్న

శ్రీ చైతన్య విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

విద్యార్థుల వరుస ఆత్మహత్యలకు కారణం అవుతున్న శ్రీ చైతన్య విద్యా సంస్థలను రాష్ట్ర వ్యాప్తంగా రద్దు చేయాలని పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఏటా వందల మంది విద్యార్థులు శ్రీ చైతన్య విద్యాసంస్థలలో చనిపోతున్నారని, నిన్న ఖమ్మం జిల్లాలో శ్రీ చైతన్య విద్యా సంస్థలో యోగ నందిని అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకొని చనిపోయిందని, ఆత్మహత్యకు కారణమైన వారిని కఠినంగా చట్టప్రకారం శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి 50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, శ్రీ చైతన్య విద్యాసంస్థల్లో విద్యార్థులను ర్యాంకుల కోసం మార్కుల కోసం మానసికంగా తీవ్ర ఇబ్బందుల గురిచేస్తున్నారన్నారు. లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నారని, అనుమతి లేకుండా వందల సంఖ్యలో శ్రీ చైతన్య బ్రాంచ్‌లను నెలకొల్పుతున్నారని, ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని వరుస ఆత్మహత్యలపైన సమగ్రంగా విచారణ జరపాలని అన్నారు. కార్యక్రమంలో పిడిఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి ప్రిన్స్, జిల్లా నాయకులు నిఖిల్, నగర నాయకులు విజయ్ తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రాన్ని అందజేస్తున్న పిడిఎస్‌యూ నాయకులు

రైతులకు మరింత మెరుగైన, నాణ్యమైన సేవలు

- పొలంబాటలో విద్యుత్ శాఖ అధికారులు

నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూర్ మండలం కేంద్రంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో శనివారం పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించారు .ఈ సందర్భంగా డిఈ టెక్నికల్ రమేష్ మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాలపై అధికారుల పొలంబాట కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఇందులో కరెంటు సరఫరా, వోల్టేజ్ గురించి వ్యవసాయ మోటార్లకు సంబంధించిన విషయాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. రైతులు స్విచ్ బోర్డు /మోటార్ స్టార్టర్‌ల దగ్గర భద్రత ప్రమాణాలు (ఎర్తింగ్) పాటించాలని చెప్పారు. ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు.జీరో విద్యుత్ ప్రమాదాల కార్యక్రమం" కూడా చేపట్టామన్నారు. ఇందులో తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల గద్దెల ఎత్తు పెంచుతామన్నారు. ఎర్తింగ్ సరిగ్గా ఉండేటట్లు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రమాదభరితంగా ఉన్న సమస్యలను పరిష్కరిస్తున్నామని చెప్పారు . హార్వెస్టర్ల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రదేశాలతో పాటు ఎక్కడైతే లైన్లు తక్కువ ఎత్తులో ఉన్న వాటి స్థానాలలో 9.1 మీటర్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తద్వారా ఎత్తు పెరిగి ప్రమాదాలను నివారించగలుతామని చెప్పారు. రైతులకు మరింత మెరుగైన నాణ్యమైన సేవలు అందించడానికి, ఎల్లప్పుడూ వినియోగదారునికి అత్యుత్తమ సేవలు అందించడానికి కంకణ బద్ధులై పనిచేస్తున్నామని తెలిపారు. కార్యక్రమం లో ఏ ఈ శ్రవణ్ కుమార్, లైన్ మెన్స్ గంగాధర్, నరేష్, రమేష్, సత్యనారాయణ, ముక్కెర విజయ్, నాడిశరం మల్లయ్య , గుండేడి పురుషోత్తం, వినోద్, సత్యం, శ్రీను, రైతులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారులు

రాష్ట్రస్థాయి సైన్స్ సదస్సుకు కేజీబీవీ ఉపాధ్యాయిని ఎంపిక

నవతెలంగాణ-ఆర్మూర్

ఎస్‌సిఇఆర్‌టీ ఆధ్వర్యంలో ఈనెల 28న వర్చువల్ విధానంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సైన్స్ సదస్సుకు పట్టణంలోని కేజీ బివి జీవశాస్త్ర ఉపాధ్యాయిని హనుమాన్లు స్రవంతి ఎంపికైనట్లు కేజీబీవీ ప్రత్యేక అధికారి గంగామణి శనివారం తెలిపారు.. ఇలా ఎంపిక కావడం ఇది ఐదవ సారి కావడంతో జిల్లా సైన్స్ విద్యాశాఖ అధికారి కె.గంగా కిషన్ స్రవంతిని ప్రత్యేకంగా అభినందించినట్లు తెలిపారు. ఈసారి నిర్వహించబోతున్న ఈ సదస్సులో ఇంప్లికేషన్స్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ యస్‌ఏ పేడగడికల్ టూల్ ఆఫ్ సైన్స్ అనే ఉప అంశం పైన, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స ఇన్ క్లాస్ రూమ్ సైన్స్ టీచింగ్... ఇట్స్ ఇంపార్టెన్స్ అండ్ ఛాలెంజెస్ అనే అంశంపై రాసిన సెమినార్ పేపర్లు రాష్ట్రస్థాయి సదస్సుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కేజీబీవీ ప్రత్యేక అధికారిని గంగామణి ,ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

ఆలయానికి స్టీల్ ప్లేట్ల వితరణ



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జంబి హనుమాన్ ఆలయ ప్రాంగణం లో శనివారం అన్నదాన కార్యక్రమంలో భాగంగా ఆలయ కమిటీ డైరెక్టర్ దొండి రమణ స్టీలు ప్లేట్లను వితరణ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన ప్రాంత భక్తులే కాకుండా పక్క ప్రాంతాలైన మెట్పల్లి, కోరుట్ల, నందిపేట్, డిచ్‌పల్లి నుండి కూడా భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నారని అన్నారు. చాలా ప్రాచీనమైన జంబి హనుమాన్ ఆలయం చాలా విశిష్టతతో కూడుకున్నదని చెప్పారు. భక్తుల సంఖ్య పెరుగుతున్నందుకు స్టీల్ ప్లేట్లు వితరణ చేస్తున్నానని అన్నారు. ఈ సందర్భంగా తనను ఆలయ కమిటీ డైరెక్టర్‌గా నియమించినందుకు ప్రొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, గోపి గౌడ్, నారాయణరెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల నియంత్రణ అధికారిగా ప్రొఫెసర్ కే సంపత్ కుమార్ నియామకం



నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిగా ప్రొఫెసర్ కే.సంపత్ కుమార్‌ను నియమిస్తూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి యాదగిరి రావు శనివారం నియామకపు ఉత్తర్వులు అందజేశారు. ప్రొఫెసర్ కే సంపత్ కుమార్ డిపార్ట్మెంట్ ఆఫ్ స్టాటిస్టిక్స్ లో ప్రొఫెసర్ గా కొనసాగుతున్నారు. వీరు ప్రస్తుతం యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గతంలో అప్లైడ్ స్టాటిసిక్స్ హెడ్‌గా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా పిఆర్ ఓగా, నోడల్ ఆఫీసర్‌గా పరీక్షల నియంత్రణ అధికారిగా వైస్ ప్రిన్సిపాల్‌గా, పబ్లికేషన్ డైరెక్టర్ గా విధులు నిర్వహించి ఉన్నతాధికారుల మన్ననలు పొందారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్. సంపత్ కుమార్ మాట్లాడుతూ.. నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి.యాదగిరి రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. యాదగిరికి కృతజ్ఞతలు తెలిపారు.

వర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రవీణ్



నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ వర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ గా డాక్టర్ ప్రవీణ్ మామిడాల ను నియమిస్తూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి యాదగిరి రావు శనివారం నియామకపు ఉత్తర్వులు అందించారు. ప్రస్తుతం యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్ గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రవీణ్ గతంలో బయోటెక్నాలజీ విభాగాధిపతిగా, పాఠ్య ప్రణాళిక సంఘం చైర్మన్ గా,పరీక్షల నియంత్రణ అధికారిగా, ఫారిన్ రిలేషన్స్,ఐక్యూ ఎసి, యూజీ సి విభాగలకు డైరెక్టర్ విధులు నిర్వహించినారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ విభాగంలో జాయింట్ సెక్రెటరీగా విధులు నిర్వహించి ఉన్నతాధికారుల మన్ననలు పొందినారు. ఉన్నత విద్య అనంతరం పరిశోధనల కొరకు చైనా, సౌత్ ఆఫ్రికా, అమెరికా దేశాలను సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ నా మీద నమ్మకంతో నియామకపు ఉత్తర్వులు అందించిన వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ యాదగిరిరావుకు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆరోగ్యం పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల సమాఖ్య కార్యాలయం లో గ్రామ సంఘాల అధ్యక్షురాళ్ళకు, గ్రామ సంఘం ఆరోగ్య కమిటీ మెంబర్లకు వివోఏ లకు ఆహారం, పౌష్టికాహారం, ఆరోగ్యం, రక్త హీనత, పరిశుభ్రతపై శనివారం అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఏపీఎం రవీందర్ మండల సమాఖ్య అధ్యక్షురాలు, అన్ని గ్రామ సంఘాల అధ్యక్షురాళ్ళ, ఆరోగ్య కమిటీ సభ్యులు, వివో ఏ లు, సీసీ లు మరియు తదితరులు పాల్గొన్నట్లు ఏపీఎం తెలిపారు.


అవగాహన కల్పిస్తున్న ఏపీఎం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

కామారెడ్డి

ఆదివారం | ఫిబ్రవరి 23, 2025 | www.navatelangana.com

అన్నదాన కార్యక్రమానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని పోసానిపేటలో వెలసిన శివాలయంలో అన్నదాన కార్యక్రమానికి శనివారం అదే గ్రామానికి చెందిన పోతుల బాపురెడ్డి, కుమారుడు దయాకర్ రెడ్డి లు రూ 11116 ఆలయ కమిటీకి అందజేశారు. ఆలయ కమిటీ వారికి ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నా రెడ్డి మహిపాల్ రెడ్డి, దాతల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


ఆర్థిక సహాయం అందజేస్తున్న గ్రామస్తులు

లక్ష్యంతో ముందుకెళ్తే విజయం



నవతెలంగాణ-భిక్కనూర్

ప్రతి విద్యార్థి విద్యార్థి దశ నుండే ఒక లక్ష్యంతో ముందుకెళ్తే విజయం సాధించడం సాధ్యమవు తుందని పట్టణానికి చెందిన న్యాయవాది శ్రీనివాస్ తెలిపారు. శనివారం మండలంలోని సిద్ధ రామేశ్వర నగర్ గ్రామ సమీపంలో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిపుణులు నైపుణ్యాత కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కష్టపడి చదువుకొని గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే విద్యతోనే సాధ్యమవుతుందన్నారు. లక్ష్యాన్ని ఏర్పరచుకొని సాధించడానికి ప్రయత్నం ముఖ్యమన్నారు. విద్యార్థులు అందరూ కలిసికట్టుగా స్నేహపూర్వకంగా ఎదగాలని ఎలాంటి అల్లర్లు కొడవలు లేకుండా చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రఘు, ఉపాధ్యాయులు శంకర్, రామ్ చంద్రం, ఉపాధ్యాయ బందం, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలి

- సిపిఐ, ఏఐఎస్ఎఫ్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా భారత కమ్యూనిస్టు పార్టీ కార్యాలయంలో సిపిఐ, ఏఐఎస్ఎఫ్ సమావేశన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టబద్రుల ఎన్నికలలో అల్ఫోర్స్ ఉట్కూరి నరేందర్ రెడ్డినీ, మెదక్, నిజాంబాద్, అదిలాబాద్, కరీంనగర్ పట్టబద్రుల అభ్యర్థి ఆయనకు భారత కమ్యూనిస్టు పార్టీ మద్దతు తెలుపుతుందని, ఆయన అనేక విద్య సమస్యలపై నిరంతరం పోరాడుతున్న నరేందర్ రెడ్డి ని పట్టభద్రులు ఆయనకు ఓట్లు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎల్ దశరథ్, సిపిఐ జిల్లా సహా కార్యదర్శి ఏఐఎస్ఎఫ్ కామారెడ్డి జిల్లా కన్వీనర్ పి శివప్రసాద్, నిఖిల్, సంపత్, జస్వంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యం

నవతెలంగాణ-తాడ్వాయి



మండలంలోని ఎర్ర పహాడ్ గ్రామానికి చెందిన వివాహిత మహిళ ఇద్దరు పిల్లలతో అదశ్యమైనట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. గ్రామానికి చెందిన చెవిటి రేవతి (24) రిత్విక్, (5) రియాన్సీ, (3) పిల్లలతో ఈనెల 20 తేదీ నా ఇంటి నుండి వెళ్లి తిరిగి రాలేదని భర్త చెవిటి రంజిత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. భార్య భర్తల మధ్య ఈనెల 19న సంసార విషయంలో గొడవలు జరిగాయని భర్త రంజిత్ మేకల మేపడానికి వెళ్లగా ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇద్దరు పిల్లలతో ఇంటి నుండి వెళ్లిందని బంధువుల గ్రామాల్లో చుట్టుపక్కల వెతికినప్పటికీ దొరకలేదని ఈ విషయమై శనివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తు నట్లు తెలిపారు.

టీకాలు క్రమం తప్పకుండా తీసుకోవాలి

నవతెలంగాణ-రాజంపేట్ (భిక్కనూర్)

టీకాలు క్రమం తప్పకుండా తీసుకోవాలని రాజంపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు ఐశ్వర్య తెలిపారు. శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న జంగంపల్లి, తలమడ్ల, తిప్పాపూర్ సబ్ సెంటర్ లలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. పిల్లలకు సంబంధించిన టీకాలు తల్లిదండ్రులు తప్పకుండా వేయించాలని ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ మంజూరు, ఏఎన్ఎం చంద్రకళ, రజిత, ఆశాలు తదితరులు ఉన్నారు.

ఆరోగ్య ఉప కేంద్రంలో ఎన్‌సిడి స్క్రీనింగ్

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని ఆయా గ్రామాలలో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాలలో నాన్ కమ్యూనికేబుల్ డిసీసెస్ (ఎన్ సి డి) వైద్య పరీక్షలను మెడికల్ అధికారి దివ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. 30 సంవత్సరాలు పైబడిన వారందరికి బీపీ, షుగర్, రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ వ్యాధులను గుర్తించడానికి 40 రోజుల్లో 100 శాతం వైద్య పరీక్షలు నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. 30 సంవత్సరాలు పైబడిన వారు తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఈ ఓ వెంకటరమణ, స్టాఫ్ నర్స్, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

10 పరీక్షలో మంచి మార్కులు సాధించాలి

నవతెలంగాణ-భిక్కనూర్

విద్యార్థులు పదవ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని కంచర్ల గ్రామానికి చెందిన ఇంద్రజాలికుడు సంతోష్ తెలిపారు. అంతర్జాతీయ ఇంద్రజాల దినోత్సవం సందర్భంగా పెద్ద మల్లారెడ్డి గ్రామంలో ఉన్న బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ స్వామి, సొసైటీ చైర్మన్ రాజా గౌడ్, ప్రధానోపాధ్యాయులు అశోక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో అశోక్ కుమార్‌కు మద్దతు

- ఎంసిపిఐయూ

నవతెలంగాణ-కామారెడ్డి

కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ శాసనమండలి ఉపాధ్యాయ నియోజకవర్గం నుండి టీఎస్ యూటీఎఫ్ బలపరిచిన టిపిటిఎఫ్ అభ్యర్థి అశోక్ కుమార్‌కు ఎంసీపీఐయూ మద్దతు ఇస్తున్నట్టు ఆ పార్టీ జిల్లాకార్యదర్శి జబ్బర్‌నాయక్ తెలిపారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని స్థానిక పార్టీ కార్యాలయంలో ప్రజాసంఘాల ముఖ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి జబ్బర్ నాయక్ మాట్లాడుతూ అశోక్ కుమార్ రిటైర్డ్ ఉపాధ్యాయుడుగా ఎటువంటి వ్యాపారం లేని వ్యక్తిగా ఉన్నాడని రేపు రాబోయే రోజుల్లో ఎమ్మెల్సీగా గెలుపొందితే పేద ప్రజల పక్షాన అసెంబ్లీలో మాట్లాడే గొంతుక, ఉపాధ్యాయ సమస్యలపై అనేక ఉద్యమాలు చేసినటువంటి అనుభవాల వ్యక్తి ఇతర ఎమ్మెల్సీలుగా పోటీ చేసే వ్యక్తులు ఒకరు వ్యాపార రీత్యా మరొకరు రియల్ ఎస్టేట్ చేస్తూ ఉపాధ్యాయులుగా కొనసాగుతున్నారని అన్నారు. అందుకే సామాజిక న్యాయం తో ఉన్న ఎంసిపిఐ యు పార్టీ ఆయనకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు నర్సింలు, రమేష్, భాస్కర్, నరేందర్, కష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బంది సకాలంలో సెంటర్‌కు చేరుకోవాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి

మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజక వర్గం ఏం.ఎల్.సి. ఎన్నికల నిర్వహణకు కేటాయించిన సిబ్బంది సకాలంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ కు చేరుకొని ఎన్నికల మెటీరియల్ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రెసిడింగ్ అధికారులు, పోలింగ్ సిబ్బంది, జోనల్ అధికారులకు రెండవ దశ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోలింగ్ సిబ్బంది సకాలంలో ఎన్నికల సామాగ్రి తీసుకునేందుకు డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి చేరుకోవాలని, ఎన్నికల సామాగ్రి


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

సేకరించి పరిశీలించుకోవాలి తెలిపారు. ఎన్నికల విధులకు హాజరుకాని సిబ్బంది పై ఎన్నికల నియమావళి మేరకు సంబంధిత సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ సిబ్బందికి ఏమైనా సందేహాలు, సమస్యలు, ఇబ్బందులూ ఉంటే శిక్షణ సమయంలో నివత్తి చేసుకోవాలని తెలిపారు . ఈ శిక్షణ సమయంలో బ్యాలెట్ బాక్స్ సీలింగ్ ప్రక్రియ ప్రాక్టికల్ గా నిర్వహించి శిక్షణ ఇవ్వ డం జరిగిందని తెలిపారు. ఎన్నికల కమీషన్ నియమ నిబంధన లకు అనుగుణంగా ఎన్నికల విధులు నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ శిక్షణ పై మాస్టర్ శిక్షకులు శిక్షణ అందించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, అదనపు కలెక్టర్లు వి.విక్టర్, శ్రీనివాస్ రెడ్డి, జిల్లా గ్రామీణాభివద్ధి అధికారి సురేందర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, ముఖ్య ప్రణాళిక అధికారి రాజారాం పాల్గొన్నారు.

బస్సులు నడపండి..

- ఆర్టీసీ అధికారులు మాపై చిన్నచూపు చూస్తున్నారని అడిషనల్ కలెక్టర్‌ను కలిసిన రామలక్ష్మణపల్లి విద్యార్థులు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి ఆర్టీసీ అధికారులు విద్యార్థులపై చిన్న చూపు చూస్తున్నారని దాంతో తమ పిల్లలు చదువుకు దూరం అవుతున్నారని రామలక్ష్మణ పల్లె విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం రామలక్షణ పల్లె విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి కామారెడ్డి జాయింట్ కలెక్టర్ విక్టర్‌ను కలెక్టర్ కార్యాలయంలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లింగంపేట్ నుండి గాంధారికి ప్రతిరోజు బస్సును మూడు ట్రిపుల్ నడపని కామారెడ్డి ఆర్టీసీ డిఎం పై చర్యలు తీసుకోవాలి జాయింట్ కలెక్టర్ కు ఇచ్చిన వినతి పత్రంలో కోరామ న్నారు. కామారెడ్డి జిల్లా లింగంపేట్ మండల నుండి గాంధారి వరకు ఆర్టీసీ బస్సులు మూడు ట్రిప్పులు నడపాల్సి ఉన్నా కానీ ఆర్టీసీ డిఎం లింగంపేట్ నుండి గాంధారి వరకు ఉదయం, సాయంత్రం ఒకటి ట్రిప్పు వస్తుందని అది కరెక్ట్ టైం కు ఆర్టిసి బస్సు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సు కోసం సాయంత్రం నాలుగు గంటల నుండి రాత్రి 7 గంటల వరకు వేచి చూస్తున్నామని.. ఆర్టీసీ డిఎంకు ఎన్నిసార్లు విన్నవించినా స్పందించడం లేదని విద్యార్థులు వాపోయారు. రామలక్ష్మణ పల్లె వాళ్ళు, నల్లమడుగు స్కూల్‌కు 150 మంది పిల్లల్ని నిత్యం చదువుకోవడానికి వెళుతుంటారని తెలిపారు.


జాయింట్ కలెక్టర్ కు తిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

తప్పుడు ఫిర్యాదుతో.. ప్రైవేట్ టీచర్ ఎమ్మెల్సీ ఓట్ల తొలగింపు

- తుది జాబితాలో ఉన్నవారి ఓట్లను యధావిధిగా ఉంచాలి
- తెలంగాణ లెక్చరర్ల ఫోరం అధ్యక్షులు డాక్టర్ బాలు

నవతెలంగాణ-కామారెడ్డి

మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ ఓట్ల తుది జాబితాలో ఉన్న ప్రైవేటు కళాశాలల అధ్యాపకులు, ఉపాధ్యాయుల పేర్లను తప్పుడు ఫిర్యాదుతో తొలగించినట్టు తెలంగాణ లెక్చరర్ల ఫోరం అధ్యక్షులు డాక్టర్ బాలు తెలిపారు. శనివారం జిల్లా



మాట్లాడుతున్న ఫోరం అధ్యక్షులు

కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ.. ఒక ఉపాధ్యాయ సంఘం తప్పుడు ఫిర్యాదును కరీంనగర్ ఎలక్ట్రోలర్ అధికారికి ఉద్దేశపూర్వకంగానే ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. దీనివలన 350 మందిగా తుది జాబితాలో ఉన్న టీచర్ ఎమ్మెల్సీ ఓటు కలిగిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు అమూల్యమైన ఓటు హక్కును కోల్పోవడం జరిగిందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 200 మందికి పైగా అధ్యాపకులు ఉపాధ్యాయులు ఓటు హక్కును కోల్పోయారని, తప్పుడు ఫిర్యాదు చేసిన వారిపై విచారణ చేపట్టాలని, ఓటు కలిగిన వారికి కనీసమైన సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా తొలగించడం సరికాదని తెలిపారు. దీనిపైన తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవు

- ఎంపీడీవో జుక్కల్ శ్రీనివాస్


దంప్‌యాడ్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-జుక్కల్

గ్రామాలలో అభివృద్ధి పనులలో నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని కేమ్రాజ్ కల్లాలి గ్రామపంచాయతీ పరిధిలో చేసిన అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. హరితహారంలో నాటిన మొక్కలకు నిత్యం రెండు పూటలు పంచాయితీ నుంచి ఉపాధి కూలీలతో నీటిని అందించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. చనిపోయిన మొక్కల చోట కొత్త మొక్కలను నాటాలని, పాత వాటిని కాపాడుకోవాలని గ్రామ కార్యదర్శిని సూచించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం ఉద్యానవనం కంపోస్ట్ షెడ్డును పరిశీలించారు. గ్రామ పరిశుభ్రత నీటి సమస్యలు దృష్టిలో పెట్టుకొని సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తగా పనులను నిర్వహించాలని తెలిపారు.

కీచక ఉపాధ్యాయుడి రిమాండ్

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని ఒక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇటీవల ఒక బాలిక పై అసభ్యకరమైన చేష్టలు చేసిన సోషల్ ఉపాధ్యాయుడు కామిండ్ల రమేష్‌ను శనివారం మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. అనంతరం 14 రోజుల జ్యూడిషియల్ రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలి



ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-పిట్లం

కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి కి ఓటు వేసి గెలిపించాలని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పట్టభద్రుల ఇంటికి , పలు షాపులలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జంబిగే హన్మాండ్లు , అడ్వకేట్ రామ్ రెడ్డి , మరగల దయానంద్ , ఇమ్రోజ్ , బొడ్ల రాజు , మోయిన్ , అశోక్ ఇతరులు పాల్గొన్నారు.

చోరీకి పాల్పడ్డ ఇద్దరి రిమాండ్

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని సంగోజి వాడి గ్రామంలో చోరీకి పాల్పడ్డ ఇద్దరిని అరెస్టు చేసి శనివారం రిమాండ్ పంపినట్లు తాడ్వాయి ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ఈనెల 17, 18, తేదీల్లో గ్రామానికి చెందిన దోమకొండ అనిల్, గడ్డం బాలరాజులు, ఇండ్ల తాళాలు పగలగొట్టి దొంగతనాలకు పాల్పడగా వారి వద్ద నుండి ఏడు గ్రాముల బంగారం, 10 తులాల వెండి, తో పటు ఒక సౌండ్ బాక్స్, 300 నగదు రికవరీ చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.


మాట్లాడుతున్న ఎస్సై

ప్రశాంతంగా పండుగలు నిర్వహించుకోవాలి


- ఎస్సై పుష్పరాజ్


మాట్లాడుతున్న ఎస్సై పుష్పరాజ్

నవతెలంగాణ-రాజంపేట్(భిక్కనూర్)

పండుగలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని, వదంతులను నమ్మొద్దని రాజంపేట్ ఎస్ఐ ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామంలో సంగమేశ్వర ఆలయ సమీపంలో ఇటీవల నిర్మించిన బ్రిడ్జి కారణంగా ఆలయానికి దారి లేకుండా పోయింది. శివరాత్రి పండుగ సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులను దష్టిలో ఉంచుకొని సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు ఎమ్మార్వో అనిల్ కు వినతి పత్రం అందజేసి, ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సమస్య పరిష్కరించాలని తాసిల్దార్ పోలీసులకు తెలియజేయడంతో విషయం తెలుసుకున్న పోలీసులు ఎలాంటి అల్లర్లు జరగకుండా ఆలయానికి వెళ్లడానికి బ్రిడ్జి పక్క నుండి దారిని ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించారు. పండుగ సందర్భంగా ప్రజల ఇబ్బందులను గుర్తించి సమస్య పరిష్కరించినందుకుగాను గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు, పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట మండలంలోని ఆయా గ్రామాలలో శనివారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో తాజా మాజా జెడ్పిటిసి సభ్యురాలు ఏలేటి శ్రీలత సంతోష్ రెడ్డిలు ప్రచారంలో పాల్గొన్నారు. మండలంలోని మోతే నల్లమడుగు ముస్తాపూర్ ఎల్లారం గ్రామాల్లో విద్యావంతుల వద్దకు వెళ్లి తమ అమూల్యమైన ఓటును కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వు ట్కూరి నరేందర్ రెడ్డికి ఓటు వేసి గెలిపించాలన్నారు.

మోతే, జల్లిపల్లి, లింగంపేట్, ఐలాపూర్, శెట్టిపల్లి సంగారెడ్డి, మంబోజిపేట్, బోనాల్ గ్రామాలలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్ర నారా గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ప్రచారాన్ని నిర్వహించారు. ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఊట్కూరి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్ర నారా గౌడ్, మాజీ సర్పంచ్ రాంరెడ్డి, సీడీసీ డైరెక్టర్ నరేందర్ రెడ్డి, మండల కోఆర్డినేటర్ కమిటీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, మోతె గ్రామ కాంగ్రెస్ ప్రెసిడెంట్ శంకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

24, 25న ఇన్‌స్పైర్ బ్రిడ్జ్ స్కూల్‌లో సైన్స్ ప్రదర్శన



నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని సర్వపూర్ లో గల ఇన్స్ స్పైర్ బ్రిడ్జ్ స్కూల్ ఆవరణలో ఈ నెల 24, 25 తేదీలలో సోమవారం, మంగళవారం సైన్స్ ప్రదర్శన నిర్వహించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వర్ గౌడ్ తెలిపారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల నైపుణ్యతను బయట తీసేందుకు ఇట్టి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తయారు చేసిన నూతన ఆవిష్కరణలు ప్రదర్శించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి రాజు మండల విద్యాధికారి శ్రీహరి హాజరవుతున్నట్లు తెలిపారు. పరిసర ప్రాంత స్కూల్, కళాశాల విద్యార్థులు మరియు తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్లు వినయ్ సాయికుమార్ లు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి పర్యటనలో గురుకుల విద్యార్థులు

నవతెలంగాణ-రామారెడ్డి

పీఎం శ్రీ పథకం అమలులో భాగంగా మండలంలోని ఉప్పల్ వాయి సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులు శుక్రవారం క్షేత్రస్థాయి పర్యటనకు తరలి వెళ్లారు. పర్యటనలో భాగంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని డైరీ టెక్నాలజీ కళాశాలను సందర్శించారు. సాంకేతికతను తెలుసుకున్నారు. అనంతరం లింగంపేట మండల కేంద్రంలోని నాగన్న మెట్ల బావిని సందర్శించారు. చరిత్రను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శివరాం మాట్లాడుతూ.. విద్యార్థులకు పీఎం శ్రీ కార్యక్రమాలు విద్యార్థులకు మానసిక ఉల్లాసం తో పాటు జ్ఞానం పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో పీఎం శ్రీ కోఆర్డినేటర్ సంతోష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

నవతెలంగాణ-మద్నూర్

ఎమ్మెల్సీ ఎన్నికల పట్ల మద్నూర్ మండల కేంద్రంలో నిర్వహించే పోలింగ్ కేంద్రాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ ఎండి ముజీబ్ ఎస్ఐ విజయ్ కొండ తెలిపారు. ఇరువురు కలిసి శనివారం నాడు మండల కేంద్రంలోని ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ ప్రశాంతంగా జరగడానికి పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు తాసిల్దార్ తెలిపారు.



మాట్లాడుతున్న తహసీల్దార్

స్కాలర్స్ ఒలంపియాడ్ స్కూల్లో కవలల దినోత్సవ సంబరాలు



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని స్కాలర్స్ ఒలంపియాడ్ పాఠశాలలో శనివారం కవలల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు పాఠశాల కరస్పాండెంట్ టీ.వేణు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవలలు బిహేవియర్, ప్రవర్తన ఒకే విధంగా ఉంటాయని అన్నారు. కవలలుగా ఉన్న విద్యార్థిని, విద్యార్థులకు ఒకే రంగు దుస్తులు ధరించి చూపరులను ఆకట్టుకున్నారు .ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ ఓ డ్డెన్న, ఉపాధ్యాయ బృందం ,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

అర్చరీ ఫెడరేషన్ మీటింగ్ లో ఈగ సంజీవ రెడ్డి



నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఢిల్లీ లో జరుగుతున్న అర్చరీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సమావేశంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు, ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు ఈగ సంజీవరెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అర్చరీ ప్రధాన కార్యదర్శి, ఢిల్లీ బీజేపీ అధ్యక్షులు వీరేంద్ర సచ్‌దేవ్, జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి అర్జున్ ముండా, ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కోశాధికారి డాక్టర్ జయిరీస్ పాల్, సహ కార్యదర్శి గుంగన్ అబ్రోల్, తెలంగాణ అర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అరవింద్ పలు రాష్ట్రాల అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి శుద్ధి కేంద్రం పరిశీలన



మరమ్మతుల గురించి అడిగి తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనర్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణానికి నీటిని సరఫరా చేసే మంచినీటి శుద్ధి కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ రాజు శనివారం పరిశీలించారు. చేపడుతున్న మరమ్మతుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.. వచ్చే వేసవికాలంను దృష్టిలో ఉంచుకొని ముందు జాగ్రత్త చర్యగా మరమ్మతులు చేయిస్తున్నారు. మున్సిపల్ ఇంజనీర్ భూమేశ్వర్, వర్క్ ఇన్స్పెక్టర్ నవీన్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణంలో మధ్యాహ్న భోజన పరిశీలన...

పట్టణంలోని రాజారాం నగర్ ప్రాథమిక పాఠశాలను మున్సిపల్ కమిషనర్ సందర్శించారు. మధ్యాహ్న భోజనంను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? రుచికరంగా చేస్తున్నారా.. లేదా అనే విషయాన్ని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ కచ్చితంగా పాటించాలని నిర్వాహకులకు పాఠశాల హెచ్‌ఎం కు సూచించారు. మెనూ వివరాలను విద్యార్థులకు కనపడే విధంగా ప్రదర్శించాలని సుచించారు. భోజనంలో నాణ్యత పాటించాలని, రుచికరంగా చేయాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ సర్వే తరువాత పనులు చేసుకోండి

- టౌన్ ప్లానింగ్ అధికారి అనూప



మాట్లాడుతున్న టౌన్ ప్లానింగ్ అధికారి

నవతెలంగాణ-మాక్లూర్

ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతుందని మున్సిపల్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి అనూప శనివారం పరిశీలించారు. మానిక్ బండారు గ్రామ శివారులోని 61వ సర్వే నెంబర్ భూమి కబ్జాకు గురవితుందని స్థానికులు తెలుపడంతో ఆమె ఆస్థలాన్ని పరిశీలించారు. అక్కడ కబ్జాదారులు ప్రీకాస్ట్ వేయిస్తుండటంతో ప్రస్తుతం పనులను నిలిపివేయాలని అన్నారు. జాతీయ రహదారి భూమి, ఇరిగేషన్ కెనాల్ భూమి ఉందని రెవెన్యూ, ఇరిగేషన్ సమక్షంలో సర్వే చేసిన తరువాత పనులు చేసుకోవచ్చని తెలిపారు. పనులను నిలిపి వేశారు. కార్యక్రమంలో ఇరిగేషన్ గ్యాంగ్ మెన్ సంతోష్, మాజీ కార్పొరేటర్ రాయ్ సింగ్, మండల మాజీ కో ఆప్షన్ మెంబర్ గౌస్, గ్రామ కమిటీ అధ్యక్షులు వినోద్ కుమార్, మాజీ ఎంపీటీసీ నర్స్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్షత్రియ సమాజ్ రాష్ట్ర మేనేజింగ్ కమిటీ మెంబర్‌గా జెస్సు అనిల్ కుమార్



నవతెలంగాణ-ఆర్మూర్

క్షత్రియ సమాజ్ రాష్ట్ర మేనేజింగ్ కమిటీ మెంబర్‌గా జెస్సు అనిల్ కుమార్ నియామకం అయ్యారు. సోమవంశీయ సహస్రార్జున క్షత్రియ (పట్కరి/ ఖత్రి) ప్రాంతీయ సమాజ్ తెలంగాణ రాష్ట్ర కమిటీలో రాష్ట్ర అధ్యక్షులు రిటైర్డ్ ఐపీఎస్ అధికారి డాక్టర్ విశ్వనాథ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టంక్ విష్ణు మున్సిపాలిటీలోని మామిడిపల్లికి చెందిన జెస్సు అనిల్ కుమార్ తెలంగాణ రాష్ట్ర మేనేజింగ్ కమిటీ మెంబర్‌గా నియామకం అయినట్టు శనివారం తెలిపారు. ఈ నియామకానికి సహకరించిన ఎస్ఎస్‌కే రాష్ట్ర ఉపాధ్యక్షులు అల్జాపూర్ శ్రీనివాస్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఖాందేష్ శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శులు పడాల గణేష్, శివ పండిత్, ఎస్ఎస్‌కే సమాజ్ మామిడిపల్లి అధ్యక్షులు ఖాందేష్ సుదర్శన్, ప్రధాన కార్యదర్శి అల్జాపూర్ నంద కిషోర్, కార్యవర్గానికి ధన్యవాదాలు తెలిపారు.

వైద్య ఆరోగ్య ఉద్యోగిని వెంటనే రిలీవ్ చేయాలి

- బిఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగి సల్మాన్ రాజ్ నిబంధనలకు విరుద్ధంగా ఐదు సంవత్సరాలుగా మున్సిపల్ కార్పొరేషన్‌లో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారని వెంటనే రిలీవ్ చేయాలని బిఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ డిమాండ్ చేశారు. శనివారం బిఎల్టియు కార్యాలయం లో విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగి కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో తన మాతృ సంస్థ నుంచి ఇతర సంస్థలోకి డిప్యూటేషన్‌పై వెళ్తే రెండు సంవత్సరాల కంటే ఎక్కువ కాలం ఉండకూడదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖలోని డిప్యూటేషన్‌లను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ సెక్రటరీ రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కానీ నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ సెక్రటరీ ఉత్తర్వులను సైతం బేఖాతరు చేస్తూ, గత 7 నెలల నుంచి జీతం లేకుండా మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేయడంలో ఆంతర్యం ఏమిటని దండి వెంకట్ ప్రశ్నించారు. ఒక ప్రభుత్వ ఉద్యోగి వారం రోజులు జీతం ఆలస్యం అవుతేనే కుటుంబం నడవడం కష్టమవుతుంది. అలాంటిది 7 నెలలుగా జీతం లేకుండా ఎలా పనిచేస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో మున్సిపల్ కార్పొరేషన్ చెత్త సేకరణ వాహనాలకు డీజిల్ తక్కువగా పోస్తున్నారని మధ్యలో వాహనాలు ఆగిపోతే డ్రైవర్ లే తమ జేబుల నుంచి డబ్బులు పెట్టాల్సి వస్తుందని పేర్కొన్నారు. డ్రైవర్స్‌తో కలిసి యూనియన్ తరుపున కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. వెంటనే జిల్లా కలెక్టర్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌లు వెంటనే వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగి సల్మాన్ రాజ్‌ను రిలీవ్ చేయాలని కోరారు.

విద్యార్థినులకు మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్

లయన్స్ క్లబ్ ఆఫ్ నవనాథపురం ఆధ్వర్యంలో మెంటల్ వెల్నెస్ వారోత్సవాల భాగంగా పట్టణంలోని ప్రభుత్వ బాలిక జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మానసిక ఆరోగ్యం, ప్రయోజనాల గురించి క్విజ్ కండక్ట్ శనివారం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మెడల్స్ సర్టిఫికెట్స్ అందజేసినారు. కార్యక్రమంలో అధ్యక్షులు చెరుకు పృథ్వీరాజ్, సభ్యులు తిరుపతి, విజయానంద్, ప్రసాద్, కళాశాల అధ్యాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

- జ్యోతి బాపూలే మహిళా డిగ్రీ కళాశాల తనిఖీ చేసిన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాలతో కూడిన శాసన మండలి ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలను పురస్కరించుకుని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను శనివారం సందర్శించారు. పోలింగ్ స్టేషన్లలో అందుబాటులో ఉన్న వసతులను తనిఖీ చేశారు. ర్యాంప్, టాయిలెట్స్, విద్యుత్ సరఫరా, నీటి వసతి ఇత్యాది సదుపాయాలను పరిశీలించారు. 27న పోలింగ్ ప్రక్రియ కొనసాగనున్న దృష్ట్యా పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రశాంత వాతావరణంలో సాఫీగా పోలింగ్ జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాలకు వేర్వేరుగా పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయగా, వాటి క్రమసంఖ్య, ఇతర వివరాలు సక్రమంగా ఉన్నాయా లేవా అని పరిశీలించారు. పాఠశాలలోని కిచెన్, తరగతి గదులను తనిఖీ చేశారు.

అంతకుముందు కలెక్టర్ మండలం మునిపల్లిలోని మహాత్మా జ్యోతిబాపూలే మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కిచెన్, డైనింగ్ హాల్, స్టోర్ రూంలను పరిశీలించి సదుపాయాలను గమనించారు. బియ్యం నిల్వలు, కూరగాయల నాణ్యత, సరుకుల స్టాక్‌ను పరిశీలించారు. కాగా, బియ్యం బస్తాలకు ట్యాగ్ లేకపోవడాన్ని గుర్తించి ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారా కేటాయించబడే ప్రతి రైస్ బ్యాగ్‌కు తప్పనిసరిగా ట్యాగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని సివిల్ సప్లైస్ డీ.ఎంను ఫోన్ ద్వారా ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, రెసిడెన్షియల్ విద్యాలయాలకు నాణ్యమైన సన్న బియ్యం సరఫరా చేసేలా పర్యవేక్షణ జరపాలన్నారు. న్యూ డైట్ మెనూ పట్టికను పరిశీలించి, విద్యార్థినులకు మెనూ ప్రకారం అల్పాహారం, భోజనం అందిస్తున్నారా అని ఆరా తీశారు. కలెక్టర్ వెంట స్థానిక అధికారులు ఉన్నారు.



కిచెన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

మండలిలో పట్టభద్రుల గొంతుకనౌతా

నవతెలంగాణ-బోధన్

శాసనమండలిలో ఎమ్మెల్సీగా విజయం సాధించి పట్టభద్రుల వారి గొంతుకనవుతానని బీఎస్పీ బలపరుస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ పేర్కొన్నారు. శనివారం బోధన్ పట్టణంలో ఆయన పట్టభద్రుల ఓటర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎందరో ఎమ్మెల్సీలు మారిన పదవులను అలంకారప్రాయంగా మార్చాలని అన్నారు. పట్టభద్రుల, నిరుద్యోగుల సమస్యలు పరిష్కారం కాలేదని అన్నారు. శాసనమండలిలో ఎమ్మెల్సీగా అడుగుపెట్టి నిరుద్యోగుల, పట్టభద్రుల సమస్యలపై ప్రశ్నిస్తానని అన్నారు. రాష్ట్రంలో ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేయించి రెగ్యులర్‌గా ఉద్యోగ ప్రకటనలు వచ్చేలా ప్రభుత్వంపై పోరాడుతానన్నారు. జీవో 46 సమస్యను పరిష్కరిస్తానని పేర్కొన్నారు. నిరుద్యోగులకు గ్రూప్, పోలీస్, టీచర్, బ్యాంక్, ఆర్ఆర్‌బీ పరీక్షలకు 365 రోజులపాటు ఉచితంగా ఆన్లైన్ కోచింగ్ అందిస్తానని వెల్లడించారు. ఉన్నత చదువులు చదివిన ఉద్యోగం రాని వారికోసం బహుళ జాతి కంపెనీలు ప్రైవేట్ కంపెనీలతో మాట్లాడి మూడు నెలలకు ఒకసారి ఉచిత జాబ్ మేళాలు నిర్వహించేలా తనవంతు కృషి చేస్తానన్నారు. సిపిఎస్ రద్దు చేయించి ఓపిఎస్ పునరుద్ధరణకు పాటుపడతానన్నారు. మోడల్ స్కూళ్లలో, గురుకులంలో జీవో 10 పద్దు కింద వేతనాలు జీవ317 మొదలైన సమస్యలకు పరిష్కారం చూపేలా కృషి చేస్తానన్నారు. అవుట్సోర్సింగ్ ఉద్యోగులు, గెస్ట్ లెక్చర్ల సమస్యలు పరిష్కారానికి, ఎస్ఎస్ఏ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించేలా పోరాడుతానన్నారు. కావున తనకు పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో బీఎస్పీ పార్టీ జిల్లా అధ్యక్షులు సింగడి పాండు, బియస్పీ రాష్ట్ర కార్యనిర్వాక సభ్యులు నీరడి ఈశ్వర్, కామారెడ్డి జిల్లా అధ్యక్షులు హరిలాల్, బాన్స్వాడ, నియోజకవర్గం అధ్యక్షులు దాసరి శ్యామ్, నీరడి శంకర్, బిఎస్‌పి మండలాల అధ్యక్షులు గౌతమ్, ఇందూర్ సాయిలు, పోతరాజ్ సుభాష్,సాయి చరణ్, సాగర్,పెద్ద సాయిలు, పవన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ

పలువురు ఆత్మీయలను పరామర్శించిన ఎమ్మెల్యే

- ఆర్థిక సహాయం అందజేత



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఆయా గ్రామాల్లో పలువురు ఆత్మీయలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి శనివారం పరామర్శించారు. చౌట్‌పల్లిలో గుండ్ల (కత్తి)మల్లేష్ వాళ్ళ అమ్మ మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మారు నర్సయ్య అమ్మ కాలం చేయడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పల్లిలో గ్రామ శాఖ అధ్యక్షులు కొంటికంటి సరేందర్ వాళ్ళ అమ్మ రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. నరేందర్‌ను, వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కొనసముందర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎలిషాల పెద్ద లింబయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. అవారి మీసాల చిన్నయ్య కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కాలేరు శేఖర్, ఇంద్రాల రాజు, అశోక్, ఉప్లూర్ గ్రామ శాఖ అధ్యక్షులు అవారి మురళి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో పలువురికి గాయాలు

- కుక్కల నివారణ గురించి పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-మోర్తాడ్

మండలంలోని సుంకెట్ గ్రామంలో వీధి కుక్కలు ద్విచక్ర వాహన దారులపై దాడికి పాల్పడుతున్నాయి. ద్విచక్ర వాహనంపై పంట పొలాలకు వెళుతున్న వారిపై కుక్కలు దాడులకు పాల్పడడంతో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి రహదారిపై పడి తీవ్ర గాయాలకు గురై ఆస్పత్రి పాలవుతున్నారు. గత మూడు రోజుల నుండి పంట పొలాలకు వెళుతున్న ప్రజలపై రహదారి గుండా వెళ్లకుండా వీధి కుక్కలు దాడులకు పాల్పడుతున్నాయి. గత రెండు రోజుల క్రితం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పంట పొలాల్లోకి వెళ్తుండగా వీధి కుక్క దాడికి పాల్పడడంతో ద్విచక్ర వాహనం నుండి అదుపుతప్పి పడి పక్కటెముకలు గాయాలకు గురైనట్టు తెలిపారు.

శనివారం మరొకరు ఇలా ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా దాడికి పాల్పడడంతో మోకాళ్లకు, ముఖానికి తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. గ్రామాల్లో వీధి కుక్కలను లేకుండా చేయాలని గ్రామస్తులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని అంటున్నారు. ప్రజలు వీధి కుక్కల బారినపడి ఆసుపత్రి పాలు కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు. గ్రామాలలో కుక్కల సంచారం అధికంగా ఉందని, వాటిని సంహరించాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు. ఉన్నతాధికారులు వాటిపై చర్యలు తీసుకొని ప్రజలకు హాని కలగకుండా తీసుకోవాల్సిన అవసరం ఉంది.

తొర్లికొండ పాఠశాలకు స్టడీ చైర్లు వితరణ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని తొర్లికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విపి ఉన్నతన్ ఫౌండేషన్ ఫౌండర్ ఆనందవల్లి (ఎన్నారై) కేరళ నుంచి విచ్చేసి పాఠశాల విద్యార్థులకు రూ.21 వేలు విలువ గల 25 స్టడీ చేర్స్, రైటింగ్ పాడ్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆనందవల్లి మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థులు మేము పేదవారిమని అనుకోకూడదు. మీరు బాగా చదువుకోని మీ అవసరాలకు సహాయం చేయడానికి మేమున్నామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం పాఠశాలలో గణితశాస్త్ర ల్యాబ్‌కి అవసరమైన పరికరాలని అందజేస్తామని తెలిపారు. ప్రతి సంవత్సరం క్రీడా దుస్తువులు అందజేస్తామన్నారు. అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి, గ్రామ స్పెషల్ ఆఫీసర్ ఎం.శ్రీనివాస్ మాట్లాడారు. మా పాఠశాలకు వచ్చి మా పాఠశాల విద్యార్థులకు ఆనందాన్ని పంచారని, ఆగస్టు నెలలో 45 వేల రూపాయల విలువగల స్పోర్ట్స్ డ్రెస్‌లను విద్యార్థులకు అందజేశారని, నేడు స్టడీ చైర్స్‌ని మా పాఠశాలకు అందజేయడం పట్ల సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ గంగా జమున, జిల్లా పిఆర్‌టియు అసోసియేట్ అధ్యక్షులు గంటా అశోక్, మండల పిఆర్టియు అధ్యక్షులు గోపి, ప్రధాన కార్యదర్శి రవిన్, ఉపాధ్యాయులు సాయిలు, రామకృష్ణ, డాక్టర్ నరసింహారావు, సునీత, కృష్ణ, మాలతి, మర్కంటి గంగా మోహన్, పల్లె గంగాధర్, స్వప్న, నర్సారెడ్డి, గౌతమి, ఓఎస్ శేఖర్ లు పాల్గొన్నారు.



తొర్లికొండ పాఠశాలకు స్టడీ చైర్లు అందజేత

గిరిరాజ్ కళాశాలలో ఉద్యోగమేళ



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

స్థానిక గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్, కెరీర్ గైడెన్స్ విభాగాల ఆధ్వర్యంలో మ్యాజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ వారి సౌజన్యంతో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. చదువులతో పాటు విద్యార్థుల వృత్తి నైపుణ్య శిక్షణ, ఉద్యోగాల కల్పనలో గిరిరాజ్ కళాశాల ఎల్లప్పుడు ముందుంటుందని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామ్ మోహన్‌రెడ్డి అన్నారు. ఉద్యోగమేళాలో టెక్ మహేంద్ర, జెన్ ప్యాక్ట్, క్వెస్ కార్ప్, హెచ్డిఎఫ్సి బ్యాంక్ ఇరోస్ ఇలా 15 కంపెనీలలో సాఫ్ట్‌వేర్, ఫైనాన్స్, సర్వీస్, బిపిఓ మొదలగు రంగాలలో వివిధ ఉద్యోగాలకై ఈ మేళా నిర్వహించారు. అందులో 600లకు పైగా విద్యార్థులు ఈ ఉద్యోగమేళాలో పాల్గొనగా, 362 విద్యార్థులు తదుపరి రౌండ్‌లకు సెలెక్ట్ కాగలరని తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్ సమన్వయకర్త డాక్టర్ పి.రామ కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రంగరత్నం, మ్యాజిక్ బస్ మేనేజర్ చందర్, ప్రతినిధులు రమేష్, నరేష్ వివిధ కంపెనీల హెచ్‌ఆర్‌లు, టిఎస్కేసీ మెంటార్ శ్రీకాంత్, కళాశాల ఉపన్యాసకులు పాల్గొన్నారు.

జాతీయ మాల యువత రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అనుపాల కిరణ్



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

జాతీయ మాల యువత రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మండలంలోని తొర్లికొండ గ్రామానికి చెందిన అనుపాల కిరణ్ నియామకమయ్యారు. మాల మహానాడు ఉద్యమా ల్లో యువతను భాగ్యస్వామ్యం చేయడంలో క్రియ శ్రీలక పాత్ర పోషించడంతో ఈ నియామకం చేపట్టడం జరిగిందని రాష్ట్ర మాల మహానాడు నాయకులు పిల్లి సుధాకర్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అనుపాల కిరణ్ మాట్లాడుతూ మాల మహాహడు అభివృద్ధికి బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు.

ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు



ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-ముప్కాల్/బాల్కొండ

ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వేం.నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ మండలంలోని రెంజర్ల గ్రామంలో శనివారం ప్రచారం చేసినట్టు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మగ్గిడి ముత్యం రెడ్డి తెలిపారు. అధికార పార్టీ అభ్యర్థులను గెలిపించుకుంటే ఉపాధ్యాయుల విన్నపాలు, ప్రజా సమస్యలపై శాసనమండలిలో గొంతు విప్పొచ్చని అన్నారు. నిజామాబాద్, మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్ ఎమ్మెల్సీగా పోటీచేస్తున్న నరేందర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, పోస్ట్ గ్రాడ్యుయేషన్ సభ్యులు, కాంగ్రెస్ యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు..

బాల్కొండ : ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బాల్కొండ మండలంలోని కిసాన్ నగర్ గ్రామంలో శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్టుభద్రుల ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఆల్ ఫోర్స్ నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గున్నాల వెంకటేష్ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షులు కనికరమ్ గంగాధర్, డిసిసి డెలిగేట్ తమ్మే కపిల్ కుమార్, మండల ఉపాధ్యక్షుడు జక్క రాజలింగం, పెనుగొండ హనుమంతు, పుట్టపర్తి పురుషోత్తం, ఆడెపు రవీందర్, బొంత రాములు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి బుర్రకథ



బుర్రకథ చెబుతున్న కళాకారులు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

భీంగల్ మండల్ జాగిర్యాల గ్రామంలోని. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వా మి స్వామివారి బుర్రకథ చెప్పడం ప్రారంభించినట్టు సంఘం సభ్యులు తెలియజేశారు. ఈ కార్యక్రమం ఐదు రోజులు నిర్వహించనున్నట్టు చెప్పారు. శనివారం ప్రభాకర్ స్వామి, లింగం, లక్ష్మణ్., జాతీయ పురస్కార అవార్డు గ్రహీత శివాజీ బ్రహ్మంగారి జీవిత చరిత్ర బుర్రకథను చెప్పినట్టు తెలిపారు. ఈకార్యక్రమం జాగర్యాల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ సర్పంచ్ శ్రీనివాస్, రామ్ చందర్, శంకర్., ప్రవీణ్, ధనరాజ్, రాజు, రాజేందర్, రవి, ప్రశాంత్, ప్రసాద్, శ్రీనివాస్, మధు తదితరులు పాల్గొన్నారు.

కబ్జా భూమిని కాపాడాలని తహశీల్దార్‌కు వినతి

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని మానిక్ బండారు శివారులో గల 61వ సర్వే నెంబర్ ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతుందని దానిని కాపాడాలని తహసీల్దార్ శేఖర్‌కు వినతి పత్రాన్ని మాజీ కార్పొరేటర్ రాయ్ సింగ్, గ్రామ శాఖ అధ్యక్షులు వినోద్ కుమార్ ఆధ్వర్యంలో వినతి పత్రం శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మానిక్ బండారు గ్రామ శివారులో గల 61వ సర్వే నెంబర్ భూమిలో కొంత 64వ జాతీయ రహదారిలో కలిసిందని, మరి కొంత భూమి ఉందని, దాని ప్రక్కనే నిజాంసాగర్ కెనాల్ 68వ డిస్ట్రిబ్యూటర్ కాలువ ఉందన్నారు. కలువ భూమిని, 61వ సర్వే నెంబర్‌లో గల భూమిని పానుగంటి గంగారెడ్డి అతని కుమారుడు కలిసి కబ్జా చేయాలని చూస్తున్నారని తహశీల్దార్‌కు పిర్యాదు చేశామన్నారు. అదే విధంగా ప్రభుత్వ భూమి, కేనలు భూమిని కబ్జా కాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో మండల మాజీ కో ఆప్షన్ మెంబర్ ఎండీ గౌస్, గ్రామస్తులు పాల్గొన్నారు

జర్నలిస్ట్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

- రూ.78,500 ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సీనియర్ ఫోటో జర్నలిస్ట్ కెవి.రమణ కుటుంబాన్ని ది హిందూ న్యూస్ పేపర్ ప్రతినిధి బృదం శనివారం పరామర్శించింది. నగరంలో పులాంగ్‌లోని రమణ నివాసాన్ని ది హిందూ తెలంగాణ రెసిడెంట్ ఎడిటర్ రవిరెడ్డి, డిప్యుటీ ఎడిటర్ మద్రి రాము, స్పెషల్ న్యూస్ ఫోటోగ్రాఫర్ నగర గోపాల్‌లు సందర్శించారు. రమణ కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన మృతి పట్ల సంతాపం తెలియజేశారు. రమణ కుటుంబానికి సంస్థ ఉద్యోగుల తరపున సేకరికించిన నగదు ఆర్థిక సహాయం అందజేశారు. ది హిందూ న్యూస్ పేపర్ సిబ్బంది రూ.78,500 ఆర్థిక సాయం చేశారు. ధైర్యంగా ఉండాలని కుటుంబ పరంగా ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన ది హిందు సంస్థ ప్రతినిధులకు నిజామాబాద్ జర్నలిస్టులు ధన్యవాదాలు తెలిపారు.

హైడ్రోక్లోరైడ్ ట్యాంకర్ బోల్తా

- డ్రైవర్ కు గాయాలు
- ట్రాఫిక్ దారి మళ్లింపు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

హైదరాబాద్ నుంచి నాగపూర్ కు వెళ్తున్న హెచ్సీఎల్ (హైడ్రోక్లోరైడ్) ట్యాంకర్ డిచ్ పల్లి మండల కేంద్రంలోని జాతీయ రహదారి 44 నాగపూర్ గేట్ చౌరస్తా వద్ద బోల్తాపడింది. ఈ ప్రమాదం లో ట్యాంకర్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. ప్రమాద వశాత్తూ జరిగిన ఈ ప్రమాదంతో హైదరాబాద్, ఇతర ప్రాంతాల నుండి నిజామాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చే వాహనాలు నిలిచిపోయాయి. డిచ్ పల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ కే మల్లేష్, ఎస్‌హెచ్ఓ మోహమ్మద్ షరీఫ్ ఘటనా స్థలానికి చేరుకుని సిఎంసి వైపు నుండి నడిపల్లి మీదుగా నిజామాబాద్‌కు ట్రాఫిక్ మళ్లించారు. బోల్తా పడిన ట్యాంకర్ సమీపానికి ఎవరిని వెళ్లకుండా పోలీసులు, తహసీల్దార్ ప్రభాకర్ దగ్గరుండి పర్యవేక్షించారు.



ప్రచారం ఫోన్లకే పరిమితం

- మెసేజ్‌లు, ఫోన్‌కాల్స్ ద్వారా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం
- విసుగెత్తుతున్న ఓటర్లు
- కనిపించని అభ్యర్థులు.. వినిపించని ప్రచారం



నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న తాజా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం వింతపోకడలు సంతరించుకున్నది. ఓవైపు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి, మరోవైపు ఉపాధ్యాయుల ఎమ్మె ల్సీ స్థానానికి హెూరాహెూరీ పోరు జరుగుతున్న విషయం అందరికీ తెలిసిందే. పార్టీలు బలపరుస్తున్న అభ్యర్థులతో పాటు ఒంటరి పోరుకు దిగిన అభ్యర్థులు సైతం ఎన్నికల ప్రచారంలో తమదైన శైలిలో పావులు కదుపుతున్నారు. అయితే ఈసారి కాస్త ఈ ప్రచారం ఆన్లైన్లో ఫోన్‌కే పరిమితమవడం గమనార్హం. ఒకరిద్దరు అభ్యర్థులు ప్రధాన కేంద్రాలలో ముఖ్య పట్టణాలలో చిన్నా చితక సమావేశాలు పెట్టి చేతులు దులుపుకున్నారు. పార్టీల బలంతో బరిలో నిలిచిన అభ్యర్థుల పరిస్థితి సైతం ఇంచుమించు అలాగే ఉందనవచ్చు. జిల్లా కేంద్రాల్లో తప్ప చాలాచోట్ల పార్టీ శ్రేణుల ప్రచారం కనిపించ కపోవడం చర్చనీయాంశమైంది. ఇందుకు పార్టీలో ఉన్న అంతర్గత వర్గ విబేదాలు, నాయకత్వ పోరు, వ్యక్తిగత ప్రాధాన్యత సన్న గిల్లడం వంటి ఇతరత్రా కారణాలు ఏవైనా కావచ్చు. కానీ ప్రచారంలో మాత్రం చెప్పుకో దగిన ప్రభావం కనిపించకపోవడం గమనార్హం. మరో వారం రోజుల్లో ఎన్నికలు జరగనుండగా అభ్యర్థుల తీరు, పార్టీ శ్రేణుల పనితీరు మాత్రం ప్రభావం చూపడం లేదన్న వాదనలు సర్వత్రా వినిపిస్తూనే ఉన్నాయి. కరీంనగర్, మెదక్, అదిలాబాద్, నిజామాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానా లకు జరుగుతున్న ఎన్నిక కీలక దశకు చేరుకున్నట్లే. మరో వారం రోజుల్లో ఎన్నిక జరగనుంది. ఉమ్మడి కేంద్రాల్లో తప్ప నియో జకవర్గాల స్థాయిలో పట్టణ, మండల కేంద్రాల స్థాయిలో ప్రచార ప్రభావం అంతంత మాత్రమే అన్న విమర్శలున్నాయి. పోటీలో ఉన్న అభ్యర్థులు కనిపించకపోగా ఊహించిన స్థాయిలో ప్రచారం కూడా జరగకపో వడం విశేషం. అటు ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటూ ఇటు స్వతంత్ర అభ్య ర్థులు సైతం ఎంతసేపు ఫోన్లో మెసేజ్ పెట్టడం, నేను ఈ ఎన్నికల్లో పోటీచేస్తున్నా మీ మొదటి ప్రాధా న్యత ఓటు నాకే వేసి గెలిపించండి అంటూ ఫోన్లో వాయిస్ ప్రచారం చేయడం పరిపాటయ్యింది. కొందరు మరో అడుగు ముందు కేసి ఓటర్లకు ఫోన్లు చేయించి మేము ఫలానా...పార్టీ అభ్యర్థి ఆఫీస్ నుండి మాట్లాడుతున్నామండి, మీ మొదటి ప్రాధాన్యత ఓటు మా అభ్యర్థికే వేయండి అని ఆన్లైన్, ఫోన్‌లైన్ ప్రచారంతో సరిపెట్టుకుంటున్నారు. ఇంతవరకు బాగానే ఉండగా, ఒక్కో ఓటరుకు ప్రతిరోజు సుమారుగా 10 నుంచి 25 వరకు ఫోన్ కాల్స్ రావడంతో పాటూ ప్రచా రానికి సంబంధించిన మెసేజ్లు చూసి విసుగత్తి అసౌకర్యానికి గురవుతున్నారు. కొందరు ఓటర్లకు అటు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరుగా, ఇటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరుగా రెండు ఓట్లు ఉండడంతో ప్రతిరోజు ఉదయం మొదలు రాత్రి వరకు 20 నుండి 25 ఫోన్‌కాల్స్ చేయడంతో వారి పరిస్థితి మరీ ఇబ్బందికరంగా మారింది. అడపాదడపా వస్తున్న ఫోన్ కాల్స్ లో ఏది తమకు అవస రమైన ఫోన్ కాలో, ఏది ప్రచారానికి సంబంధించిన ఫోన్ కాలో తెలియక విసుగెత్తుతున్నారు. మొత్తం మీద ఈసారి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చెప్పుకోదగ్గ ప్రభావం చూపకుండా ఆన్లైన్, ఫోన్ లైన్ ప్రచారానికే పరిమితమైందన్న వాదనలు సర్వత్ర వినిపిస్తున్నాయి.

నేడు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రం శివారులోని లలిత గార్డెన్స్ లో ఆదివారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకట రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, మెదక్, అదిలాబాద్ పట్టభద్రుడు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నరేందర్ రెడ్డికి మద్దతుగా ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, భూపతిరెడ్డి, బాల్కొండ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల కోఆర్డినేటర్ వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్, కార్పొరేషన్ చైర్మన్లు, వివిధ స్థాయి జిల్లా నాయకులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని పట్టభద్రులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించండి

ఆర్మూర్ చిన్న బాలరాజ్



ఎమ్మెల్సీ బ్యాలెట్‌ను కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ -ధర్పల్లి

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రేవంత్‌రెడ్డి సారథ్యంలో పాలన చేపట్టి 14 నెలలు గడవకముందే నిరుద్యోగుల జీవిత కలనెరవేర్చిన యువత కల సాకారం చేసిన్న పార్టీ కాంగ్రెస్ పార్టీ అని మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాల్‌రాజ్ అన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో మరిన్ని ఉద్యోగ అవకాశాలు, ఉపాధి అవకాశాలు యువత స్థిరపడే అవకాశాలను కల్పించేందుకు అధికార పార్టీ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి అయిన ఆల్ ఫోర్స్ నరేందర్ రెడ్డి ని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. పార్టీ అభ్యర్థి గెలుపునకు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పట్టభద్రుల ఇంటికి వెళ్లి కాంగ్రెస్ అభ్యర్థి గెలిస్తే జరిగే అభివృద్ధి పట్ల అవగాహనా కల్పించడం జరుగుతుందని అన్నారు. ఎన్నికల బ్యాలెట్లో రెండవ నంబర్ పై తమ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ధర్పల్లి, హొన్నాజీపేట సొసైటీల చైర్మెన్లు చెలిమెల మల్లికార్జున్, జనార్దన్ రెడ్డి, నాయకులు మిట్టపల్లి గంగారెడ్డి, పుప్పాల సుభాష్, చెలిమెల నర్సయ్య, చెలిమెల శ్రీనివాస్, సుభాష్ రెడ్డి, అబ్దుల్ హమీద్, జాన్‌రెడ్డి, నల్ల సుదర్శన్, రొండ్ల గంగారెడ్డి, ఆయా గ్రామాల గ్రామశాఖ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

అన్నం తినిపించి..ఆప్యాయంగా పలకరించి

- విద్యార్థుల సమస్యలు తెలుసుకున్న తహసీల్దార్ మాలతి
- మధ్యాన్న భోజనం తనిఖీ



చిన్నారికి భోజనం తినిపిస్తున్న తహసీల్దార్

నవతెలంగాణ-ధర్పల్లి

మండల కేంద్రంలో ప్రభుత్వ ప్రైమరి పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని శనివారం తహసీల్దార్ బండారి మాలతి తనిఖీ చేశారు . విద్యార్థులకు మెనూ ప్రకారం ఏ రోజు ఎలాంటి భోజనాలు వడ్డిస్తున్నారని చిన్నారులను అడిగి తెలుసున్నారు. వంటలు రుచికరంగా ఉంటున్నాయా లేదా అని విద్యార్థులను అడిగి వారికి స్వయంగా వడ్డించడంతో పాటు తన చేతితో తినిపించి విద్యార్థులకు ఆప్యాయంగా మాట్లాడటం చిన్నారులు ఆనందంవ్యక్తం చేశారు. ఇదంతా చూస్తున్న ఉపాధ్యాయులు తహసీల్దార్ ఆప్యాయతపై హర్షం వ్యక్తం చేశారు. ఎంతైనా అమ్మ కదా అంటూ మహిళా ఉపాధ్యాయురాళ్లు చిరునవ్వులు నవ్వుకున్నారు. వారి వెంట ఆర్ఐ రాజేశ్వర్, తదితరులు ఉన్నారు .

ఫీజులకోసం ఇబ్బందిపెడుతున్న

కృష్ణవేణి, సంస్కృతి స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

విద్యార్థులు ఫీజులు కట్టాలని లేకపోతే పరీక్షలు రాయనీయమని విద్యార్థులను ఇబ్బంది పెడుతున్న మోర్తాడ్ మండలంలోగల కృష్ణవేణి స్కూలు, సంస్కృతి ప్రైవేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని పీడిఎస్‌యు ఆర్మూర్ డివిజన్ అధ్యక్షుడు ప్రిన్స్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ అధికారి డీఈఓ పీ.అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కృష్ణవేణి, సంస్కృతి స్కూల్స్ కమర్షియల్ బిల్డింగ్ లో తరగతులు నిర్వహిస్తున్నారని, కనీస సౌకర్యాలు కల్పించకుండా విద్యార్థుల నుండి వేల రూపాయలు ముక్కు పిండి వసూలు చేస్తున్నారని, ఫీజుల కోసం రకరకాల యూనిట్ టెస్టుల పేర్లతో విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారని, సీట్ల పరిమితికి మించి బస్సులలో విద్యార్థులను తరలిస్తున్నారని, ఫైర్ సేఫ్టీ లేకుండా సేఫ్టీ గ్రిల్స్ లేకుండా ఇలా అనేక నిబంధనలను ఉల్లంఘిస్తూ విద్యార్థులు జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని అన్నారు. వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ జిల్లా నాయకులు నిఖిల్, విజయ్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్ డివిజన్ టాపర్లుగా మిసిమి విద్యార్థులు



సన్మానిస్తున్న స్కూల్ యాజమాన్యం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని మిసిమి ఉన్నత పాఠశాల విద్యార్థులు క్షత్రియ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్టులో డివిజన్ టాపర్లు గా నించినట్లు పాఠశాల కరస్పాండెంట్ బాలి రవీందర్ తెలిపారు. సదుల్లా హరిణి 39మార్కులతో టాపర్ గా, కే. రిషివర్ధన్, పి.కలవర్షిణి 36 మార్కులతో సెకండ్ టాప్పర్‌గా నిలిచినట్లు ఆయన తెలిపారు. పాఠశాల విద్యార్థులు డివిజన్ స్థాయిలో టాలెంట్ టెస్టులో స్టాపర్లుగా నిలవడం పాఠశాలకు ఎంతో గర్వకారణమని కరెస్పాండెంట్ రవీందర్ పేర్కొన్నారు. టాపర్లతో పాటు టాలెంట్ టెస్టులో పాల్గొన్న విద్యార్థులు టి.హర్షిని, కే.రియా, రిశ్వంత్, మహంతిలను క్షత్రియ జూనియర్ కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో సన్మానించి, మెమోంటోలు అందజేసినట్లు ఆయన తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్



ప్రదర్శనను తిలకిస్తున్న అధికారులు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని పెద్ద మల్లారెడ్డి గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఎటిఎల్ కమ్యూనిటీ అవుట్ రీచ్ ప్రోగ్రాం, సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని జిల్లా విద్యాధికారి రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు తయారుచేసిన సైన్స్ పరికరాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల మేధాశక్తి పెంపొందించడానికి సైన్స్ ఎగ్జిబిషన్ ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ రాజాగంగారెడ్డి, ఎంఎన్ఓ శ్రీనాథ్, ఏఎంఓ వేణు శర్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రసూనాదేవి, ప్రధానోపాధ్యాయులు ప్రసూన దేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు ఉన్నారు.

చికెన్, ఎగ్ మేళ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో శనివారం సాయంత్రం వెన్‌కాబ్ కంపెనీ ఆధ్వర్యంలో స్థానిక చికెన్ సెంటర్ నిర్వాహకుల సహకారంతో చికెన్, ఎగ్ మేళ నిర్వహించారు. కోళ్లలో బర్డ్‌ఫ్లూ వ్యాధి నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు వెన్‌కాబ్ కంపెనీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యారు. వారికి ఉచితంగా చికెన్, ఉడకపెట్టిన కోడిగుడ్లు, ఎగ్ స్నాక్స్ నిర్వాహకులు పంపిణీ చేశారు. మన రాష్ట్రంలో ఎలాంటి బర్డ్‌ఫ్లూ వ్యాధి కోళ్లలో లేదని, ప్రజలు నిర్భయంగా చికెన్ తినొచ్చని ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండలంలోని ఆయాగ్రామాల్లోని చికెన్ సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.



ఎగ్, చికెన్ మేళాలో పాల్గొన్న ప్రజలు

ఏమైనా సమస్యలు ఉన్నాయా?

- అడిషనల్ కలెక్టర్ అంకిత్
- వసతిగృహంలో బస

నవతెలంగాణ-డిచ్‌పల్లి/నిజామాబాద్

అడిషనల్ కలెక్టర్ అంకిత్ డిచ్ పల్లి మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి గ్రామంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని శుక్రవారం రాత్రి ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల సౌకర్యాలు, మౌలిక సదుపాయాలను తనిఖీ చేశారు. విద్యార్థులు సిబ్బందితో మాట్లాడి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.అనంతరం రాత్రి వసతి గృహంలోనే విద్యార్థులతో కలిసి నిద్రపోయారు. శనివారం ఉదయం వసతి గృహంలో పిల్లలకు ఇచ్చే అల్పాహారం తనిఖీ చేశారు. విద్యార్థుల గదికి సమీపంలో ఒక కంప్లైంట్ బాక్స్‌ను ఉంచాలని సిబ్బందికి ఆదేశించారు. వారి వెంట మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ గౌడ్, ఎస్సీ బాలుర వసతి గృహం సిబ్బంది ఉన్నారు.

నిజామాబాద్:నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో ఎడపల్లి తహసీల్దార్ ధన్వల్ శుక్రవారం రాత్రి బస చేశారు. వసతి గృహం వార్డెన్ నర్సింలు సమంత ఆదేశాల మేరకు బస నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకే వసతి గృహంలో బస నిర్వహించినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడాతూ.. విద్యార్థులకు ఉదయం, సాయంత్రం పౌష్టికాహారం, నాణ్యమైన భోజనాన్ని అందించడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట వార్డెన్ నవ్య ఉన్నారు.



డిచ్‌పల్లి : హాస్టల్లో నిద్రిస్తున్న అదనపు కలెక్టర్

రాష్ట్ర బడ్జెట్లో విద్యరంగానికి

15 శాతం నిధులు కేటాయించాలి

నవతెలంగాణ-కామారెడ్డి

రాష్ట్ర బడ్జెట్లో విద్యరంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని దళిత బహుజన ఫ్రంట్ జిల్లా కన్వీనర్ అయిండ్ల ప్రభాకర్ రాష్ట్ర ప్రభుత్వన్ని కోరారు. శనివారం కామారెడ్డి జిల్లాలోని నూతనంగా ఏర్పడిన పాల్వంచ మండల కేంద్రంలో తహసీల్దార్ లక్ష్మన్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ 2024 - 2025 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర బడ్జెట్లో విద్య రంగానికి కేవలం 7 శాతం మాత్రమే నిధులను కేటాయించారని తెలిపారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలోనైనా విద్యారంగానికి 15 శాతం నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో కనీస వసతులు కరువై విద్యార్థులు సమస్యల నడుమ చదువులు కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసర్ నివేదిక ప్రకారం 5.4 శాతం పాఠశాలలో టాయిలెట్స్ లేవని, 19 శాతం పాఠశాలలు పాడుబడి ఉన్నాయని పేర్కొన్నారు. అంతేకాకుండా గురుకులాలు సంక్షేమ వసతి గహాలకు పక్క భవనాలను నిర్మించాలని డిమాండ్ చేశారు.

టీజీసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

- ప్రిన్సిపాల్ టి.నళిని

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ బీసీ గురుకులాల్లో ఐదవ తరగతిలో, ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఈ నెల 23న నిర్వహించే ప్రవేశ పరీక్ష (టీజీసెట్) కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డిచ్ పల్లి మండలం లోని సుద్దపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాల ప్రిన్సిపల్ టి. నళిని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఐదవ తరగితిలో (ప్రవేశానికి, 6, 7, 8, 9 తరగతులలో బ్యాక్ లాగ్ సీట్ల భర్తీ కోసం ప్రవేశ పరీక్ష పరిక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష ఉదయం 11 గంటలనుండి ఒంటి గంట వరకు ఉంటుందని, పరిక్షకు హాజరయ్యే విద్యార్థులు ఉదమం 10 గంటల వరకు పరీక్ష కేంద్రానికి హాజరు కావాలని సూచించారు. పరీక్షలకు వచ్చే వారు తమ వెంట హాల్ టికెట్, ఆధార్ కార్డు జిరాక్స్, బ్లాక్, బ్లూ పెన్నులు పీరిక్ష అట్ట తప్పకుండా తీసుకుని రావాలని తెలిపారు.

ఎన్ఎస్ఎస్ వాలంటీర్‌కు అభినందనలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్ జి.సంగీత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లో వారం రోజుల పాటు అనగా ఈ నెల 3 నుండి 9 వరకు నిర్వహించిన "జాతీయ సమైక్యతా శిబిరం" ను విజయవంతంగా పూర్తి చేసుకుని వచ్చినందున కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.రాంమోహన్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ విభాగాల అధికారులు, సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్. ఎస్-ఎస్. అధికారులు జి.నాగజ్యోతి, జి.సుధాకర్ రావు, యం.దస్తప్ప డా.ఈ.వెంకటరమణ, టి.నరేశ్ , ఎస్.రజిత పాల్గొన్నారు.

ప్రశాంత్‌రెడ్డి ఆరోపణలు అర్థరహితం

- పదేళ్ల పాలనలో రైతులను మోసం చేసిన బీఆర్ఎస్
- టీపీసీసీ అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్

నవతెలంగాణ కమ్మర్ పల్లి

కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి చేసిన ఆరోపణలు అర్థరహితమని టీపీసీసీ అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో పసుపు రైతుల్ని మోసం చేసింది కాక సకాలంలో రైతు రుణమాఫీ చేయకుండా పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వకపోవడం వల్ల దాదాపు 1200 మంది రైతుల ఆత్మహత్యలకు కేసీఆర్ పాలనే కారణమన్నారు. అవన్నీ కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వంపై అర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో పసుపు ధర క్వింటాలకు రూ.5వేలు దాటలేదని, పసుపు రైతులను మోసం చేశారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో పసుపు రైతుకు కటాఫ్ రేట్ పెట్టకుండా రైతులను నట్టేట ముంచిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పసుపు రైతులను ఆదుకోవాలని పసుపు పంటకు క్వింటాలుకు కొమ్ముకు పదివేలు రేటు తగ్గకుండా నిర్ణయం తీసుకున్నారన్నారు. మండకు కటాఫ్ రేటు రూ.9వేల ధర తగ్గకుండా పసుపు రైతులను ఆదుకుంటుందన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై అర్థం లేని ఆరోపణలు చేయడం ప్రశాంత్ రెడ్డి మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి, డీసీసీ ఉపాధ్యక్షులు శివన్నోల శివకుమార్, ఏర్గట్ల మండల పార్టీ అధ్యక్షుడు దేవా రెడ్డి, రాజా ముత్యం, పల్లె శేఖర్, చరణ్ ముదిరాజ్, కు%శీ%దారపు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

BEFORE THE DISTRICT CONSUMER DISPUTES REDRESSAL FORUM AT NIZAMABAD
CC. No. 99 of 2024

Between:
Lakavath Ravi
...**Complainant**
And
Branch Manager Unique Mercantile India Pvt. Ltd, & ano
..**Opposite parties**

To Opposite party no.1
Branch Manager Unique Mercantile India Pvt. Ltd, 7-10-910/3/1, Block B. 1" floor, Godown road, Nizamabad 503001.

Whereas the complainant has instituted a complaint against you and you are hereby summoned to appear in this court in person or by pleader duly instructed and able to answer all material questions relating to the suit or who shall be accompanied by some other person able to answer all such question on the **7th day March 2025 at 10.30 a.m.,** in the forenoon to answer the claim and you are directed to produce on that day all documents on which you relied in support of your defence.

Take notice that in default of your appearance on the day above mentioned, the petition will be determined in your absence.

// BY ORDER OF THE COURT //
Yerram Ganapathi
Advocate, Nizamabad